# నా సన్నిధిలో నడచుకొనుము

## (అబ్రాహాము జీవితములోని పతనము)

భక్తసింగ్

| | | |
|---|---|---|
| మొదటి ముద్రణ | : | జూన్ 1971 |
| రెండవ ముద్రణ | : | జూలై 1974 |
| మూడవ ముద్రణ | : | ఏప్రిల్ 1982 |
| నాల్గవ ముద్రణ | : | మే 1989 |
| ఐదవ ముద్రణ | : | మే 1994 |
| ఆరవ ముద్రణ | : | అక్టోబరు 2007 |

పుస్తకములు కావలసినవారు ఈక్రింది
అడ్రసుకు వ్రాయ మనవి

**హెబ్రోను**

గోల్కొండ చౌరస్తా, హైదరాబాదు - 500 020 (ఆం.ప్ర.)

*Printed at :*

**S.S. Graphics**

Nallakunta,
Hyderabad - 500 044.

# విషయసూచిక


| అధ్యాయము | | పుట సంఖ్య |
|---|---|---|
| 1. | అబ్రాహాము యొక్క పిలుపు | 1 |
| 2. | మానవ మమత యొక్క అపాయము | 7 |
| 3. | ఆత్మీయ ఆహారము యొక్క అవసరత | 14 |
| 4. | దేవుని నిబంధన | 21 |
| 5. | విశ్వాసము ద్వారా శక్తి | 25 |
| 6. | ఏడవ ప్రత్యక్షత | 33 |
| 7. | విధేయత - ఆశీర్వాద రహస్యము | 41 |
| 8. | వధువు నేర్పరచుకొనుట | 49 |

## అధ్యాయము - 1

# అబ్రాహాము యొక్క పిలుపు

దేవుని వాక్యమునందు మూడుచోట్ల అబ్రాహాము దేవుని స్నేహితుడని పిలువబడెను (యెషయా. 41:8; 2దిన.వృ. 20:7; యాకోబు 2:23). ప్రభువైన యేసుక్రీస్తు యోహాను 15:15లో శిష్యులు తనకు స్నేహితులుగా నుండవలెనని కోరుచున్నట్లు చెప్పెను. స్నేహితులు తమ రహస్యములను పంచుకొలది స్నేహము ఎల్లప్పుడు బలపడును. కనుకనే ఆయన హృదయ రహస్యములన్నిటిని మనము తెలిసికొనవలెనని కోరుచున్నాడు. దేవుడు సొదొమ గొమొఱ్ఱాలను నాశనము చేయుటకు పూర్వము ఆది కాం. 18:17లో 'ఈ రహస్య మును నాస్నేహితుడైన అబ్రాహాము నొద్ద ఎట్లు దాచగలను;'' అని పలికెను. మనము దేవుని పరలోకపు ఏర్పాటులోనికి వచ్చునప్పుడు, మన మాయన స్నేహితులుగా నుండవలెననియు, మనకు ఆయన గూఢ మైన మర్మములు బయలు పరచవలెననియు కోరుచున్నాడు. మనము ఇట్టి సహవాసము దేవునితో అనుభవించుచున్నాము(మత్తయి 13:17). కావున జ్ఞానులకును, వివేకులకును మరుగు పరచబడిన సంగతులను మనకు బయలు పరచవలెనని దేవుడు ఆశించుచున్నాడు. 1 పేతురు 1 : 12లో ''దేవదూతలు ఈ కార్యమును తొంగిచూడ గోరుచున్నారు'' అని పేర్కొనబడిన కార్యములు దేవదూతలకును, దేవుని ప్రవక్తలకును, గొప్ప దైవ జనులకు దాచబడిన మర్మములకు వర్తించును. కాని ఈమర్మ ములే ప్రభువైన యేసుక్రీస్తునకు స్నేహితులమైన బయలు పరచబడినవి.

ఆదికాం. 10వ అధ్యా॥ నుండి ఆరంభించి పది పర్యాయములు దేవుడు అబ్రాహామునకు ప్రత్యక్షమయ్యెను. 12వ అధ్యాయములో ఆయన రెండు మారులు ప్రత్యక్షమయ్యెను. ఆయన ప్రతి ప్రత్యక్షత యందు దైవ స్నేహముయొక్క రహస్యమును బయలు పరచెను. ఇది క్రమ క్రమముగా నియ్యబడిన ప్రత్యక్షత (ఆదికాం. 12 : 1 చూడుము).

ప్రభువైన యేసుక్రీస్తుయొక్క నిజమైన స్నేహితులుగా నుండుటకు మనము పాత స్నేహములనుండి నూతన స్నేహములోనికి తేబడవలెను. మనము ప్రాచీన స్నేహము నుండి, ఐక్యతలనుండి, సంబంధములనుండి సంపూర్ణముగా తెంచి వేయబడవలెను. మనము లోకమునుండి, దేవునితో స్నేహము ఆనందించలేని లోక బంధు, మిత్రాదుల నుండి దేవుని బలమైన హస్తముచేత బయటకు లాగబడునట్లు యోహాను 15 : 19లో గుర్తించుచున్నాము.

అనేక సందర్భములలో ప్రభువు ఒక్కమాటతో లేక ఒక్క తాకుడుతో రోగులను స్వస్థపరచెను. అయినను మార్కు 8 : 23లో నున్న సందర్భమున గ్రుడ్డివాని చేయిపట్టుకొని వెలుపలికి తోడుకొని పోయిన ఉదాహరణద్వారా, నిజమైన శిష్యులముగా లేక స్నేహితులముగా ఎట్లుండగలమో చూపించుచున్నాడు ఆ దినమువరకు గ్రుడ్డివాడు తన బంధువులచేత లేక స్నేహితులచేత నడిపించబడుచుండెను. కాని ప్రభువు అతనిని నడిపించిన దినమున ఆయన యిట్లు పలికినట్లుండెను. ''ఇక నిన్ను అనుదినము నడిపించి నీకు సహాయము చేయనిమ్ము''. కనుక ఆయన పాత సహవాసములోనుండి అతనిని వెలుపలికి తీసికొని వచ్చెను? ఆయన మహత్కార్యము జేయుటకు భయపడికాదు, గాని ఒక

ఉద్దేశముతోనట్లుచేసెను. అదే ఉద్దేశముతో అబ్రాహాము తన రక్త సంబంధులను, స్నేహితులనందరిని విడచిపెట్టుటకు బలవంత పరచ బడి నూతన బంధువులను పొందెను. ఆ దేవుని స్నేహమును ఆనందించ గోరిన యెడల ఈ మొదటి పాఠమును నేర్చుకొనవలెను.

ఆది 12 : 2, 3లలో ఏడంతల ఆశీర్వాదమును అబ్రాహామునకు దేవుడు వాగ్దానము చేసెను. ''నిన్ను గొప్పజనముగా చేసి, నిన్ను ఆశీర్వదించి, నీ నామమును గొప్ప చేయుదును. నీవు ఆశీర్వాదముగా నుందువు, నిన్ను ఆశీర్వదించు వారిని ఆశీర్వదించెను. నిన్ను దూషించు వారిని శపించెదను, భూమి యొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడును.'' దేవుని స్నేహితుడుగా నుండగోరిన ఏవ్యక్తికైనను, ఈ ఏడంతల ఆశీర్వాదము వర్తించును. దీనిలోని ఒక్కొక్క పదమును చూతము.

**''నిన్ను గొప్ప జనముగా చేసి''** : ఒకసారి నీవు రక్షించబడిన యెడల నీద్వారా అనేకులు రక్షింపబడవచ్చును. వారిద్వారా ఒకరి తరువాత ఒకరు ఇంకను రక్షింపబడవచ్చును. మనమందర మాయన కుటుంబములో నొక భాగముగుదుము. మనప్రార్థన, సాక్ష్యము, ప్రేమ, పరిచర్య మొదలగువాటి మూలమున ఇతరులు రక్షింపబడ వచ్చును.

**''నిన్ను ఆశీర్వదించి''** : మనము దేవుని యొద్దనుండి పలు రకములగు నిత్యమైన ప్రత్యేక ఆశీర్వాదములను అను దినము పొందుటకు ఆరంభించుదుము. నూతన జీవమును బట్టి మనము శాశ్వతమైన ఆనందమును, ప్రేమను, స్నేహములను కలిగి యున్నాము.

**''నీ నామమును గొప్ప చేయుదును''** : ఒక మనుష్యుడు లోకములో ఎంతగొప్పవాడైనను, చనిపోయినప్పుడు సంపూర్ణ ముగా మరువబడును. కాని తిరిగి జన్మించిన మనుష్యుడు మరియు ప్రభువైన

యేసు క్రీస్తుకు చెందినవారందరును మరణమునందు, పరలోకములో రాజులు గాను, యాజకులుగాను, ఆహ్వానింపబడుదురు.

**"నీవు ఆశీర్వాదముగా నుందువు"** : భూలోకములో నున్న వారు మనద్వారా ఆదరణ, ప్రోత్సాహము, బలము పొందెదరు.

**"నిన్ను ఆశీర్వదించు వారిని ఆశీర్వదించెదను"** : ఈ మాటలను వివరించ నగత్యములేదు. వాగ్దానము యొక్క భావము ఎంతో స్పష్టముగా నున్నది. మనకు విరోధముగా శత్రువు యొక్క ఏ ఆయుధము నైనను ఆయన వర్థిల్లనీయడు యను వాగ్దానము ఉన్నది.

**"భూమి యొక్క సమస్తవంశములు నీయందు ఆశీర్వ దించబడును"** : మనము సమస్త జనాంగములకు వర్తమానమును కలిగియున్నామని ఈ వాగ్దానము సూచించుచున్నది. ప్రభువు మనలనెక్కడకు తీసికొని పోయినను అదే సువార్తను, అదే వర్తమానమును అందించగలము.

ఏడంతల ఆశీర్వాదము- లోకమునుండి, లోక సహవాసముల నుండి వెలుపలికి వచ్చుటకు సిద్ధముగా నున్న ప్రతియొక్కరి నిమిత్తము ఏర్పాటు చేయబడినది. ఏడవ వచనములో, దేవుడు మరల అబ్రాహాము నకు ప్రత్యక్షమయ్యెను. దేవుని నారాధించుటెట్లో అబ్రాహాము నేర్చుకొను చుండెను. దేవుడు అతనికి ప్రత్యక్షమై ఆరాధించుటెట్లో నేర్పించెను. అతనిని నీతిమంతునిగా చేయుటకు అతనికి బదులు ఎవరైనా చనిపోవల యునను సామాన్య పాఠమును బలిపీఠము ద్వారా అతడు నేర్చుకొను చుండెను. మనమంతట మనమే అనగా, మన స్వంత ప్రయాసము, ప్రయత్నములద్వారా మనలో ఒక్కరమైనను నీతిమంతులము కాలేము.

ప్రజలు అంధకారములో నిలిచి యుండుటకు కారణము, వారు తమ స్వంత ప్రయాసముల ద్వారా నీతిమంతులగు టకు యత్నించిరి. మనలను నీతిమంతులుగా చేయుటకు మన పాపముల నిమిత్తము మనకు బదులుగా మరణించుటకు ఈలోకమునకు వచ్చిన యేసు క్రీస్తు ప్రభువు యొక్క మరణమును, అర్పణను, బలిపీఠము చూపించుచున్నది. మనము దేవుని ఆరాధించుటకు ఎంత ఎక్కువగా నేర్చుకొందుమో అంత ఎక్కువగా మనలను నీతిమంతులుగా చేయు టకు, మన నిమిత్తము మరణించుటలో ఎంత గొప్ప క్రయమును ఆయన చెల్లింప వలసి వచ్చెనో గుర్తించగలము, అట్టి గ్రహింపు మనలను ఎక్కువ కృతజ్ఞులనుగా జేసి, మన పూర్ణ హృదయముతో ఆరాధించుటకు సహాయపడును.

కరువు మూలముగా అబ్రాహాము తన భార్యను తీసికొని ఐగుప్తునకు వెళ్ళెను (17వ వచనము). వారిద్దరే గనుక అక్కడ గొప్ప అపాయ ముండెను. కాని దేవుడు వారిపక్షముగా పనిచేసి, జోక్యము చేసికొని వారిని కాపాడెను. అదేవిధముగా దేవుడు అనేక పాపములనుండి మనలను అదృశ్యవిధానములో కాపాడును. మనము తిరిగి జన్మించినప్పుడు దేవతలము కాలేదు. మనము మానసిక సమస్యలను ఎదుర్కొనవలెను. మన యొక్క శరీరములు మంటి శరీరములుగానే నిలిచి యుండును. మరియు మనము పరీక్షలు, దుఃఖము, బాధలు, రోగములు అనేక విధములగు నిరుత్సాహములను ఎదుర్కొనవలసి వచ్చును. అయినను దేవుడు అన్ని సమయములలో మనలను కాపాడుచుండుటను కనుగొనగలము (1కొరి. 10:13; 2 కొరి. 2:9; కీర్త. 24:7). మనము మానవ బలహీనత ద్వారా గొప్ప అపాయములలో, వేదనలలో, పరీక్షలలో నున్నప్పుడు మనలను

ఏవిధముగా కాపాడవలయునో ప్రభువు ఎరుగునని జ్ఞాపకముంచుకొన వలయును.

భయము మూలముగా అబ్రాహాము ఒక అబద్ధమును లేక సగము అబద్ధమును చెప్పెను. ఆయన శారాను గూర్చి ఈమె నా సహోదరి అని చెప్పెను (ఆది కా 12:13). ఒక విధముగా ఆమె అతని సహోదరి యే. ఒక నూతన మార్గ ఆరంభములో నున్నప్పుడు అనేక సార్లు భయము లతో నిండియుండుటను కనుగొందుము. కాని ప్రభువు తన కృపా, కనికరములతో మనలను ఈ భయములనుండి కాపాడి రక్షించును. మనము ఆయనకు నమ్మకముగా నుండి ఆయనను విశ్వసించి ఆయనకు లోబడవలెను. అప్పుడు ఆత్మీయ జీవితములోను, విశ్వాసములోను అడుగడుగున ఎదుగుదల గమనించగలము.

❖❖

## అధ్యాయము - 2

# మానవ మమత యొక్క అపాయము

అబ్రాహాము ''దేవుని స్నేహితుడని'' పిలువబడెను. ప్రభువైన. యేసుక్రీస్తు, తండ్రి యొద్దనుండి తాను పొందిన సమస్తమును మనకియ్య గోరుచుండుటను బట్టియే యోహాను 15లో తన యందు విశ్వసించు వారిని గురించి యిట్లు పలికెను. మిమ్ములను దాసులని పిలువక స్నేహితులని పిలుచుచున్నాను. ''మనము ఆత్మీయముగా ఎదుగుకొలది ప్రభువైన యేసుక్రీస్తు యొక్క స్నేహము నందు ఆనందించుదుము. ధారాళముగా ఆయనతో మాట్లాడుదుము, సమస్త రహస్యములు ఆయనతో చెప్పుదుము. ఆయన కూడ ప్రేమతో మాట్లాడుచు అనుదినము క్రొత్త క్రొత్త సంగతులెన్నో మనకు చూపించును. జ్ఞానులకును, వివేకులకును మరుగు పరచబడిన సంగతులు పసిబాలురకు బయలుపరచబడినట్లు మత్తయి 11:25లో మనకు జ్ఞాపకము చేయబడుచున్నది.

నలువది సంవత్సరముల కాలములో దేవుడు అబ్రాహామునకు పదిసార్లు ప్రత్యక్షమయ్యెను ప్రతి ప్రత్యక్షతలోను దైవ స్నేహము యొక్క నొక నూతన రహస్యమును బయలు పరచెను. వాస్తవముగా, ఈ ప్రత్యక్షతలను దైవ స్నేహము యొక్క పది మెట్లుగా పరిగణించ వచ్చును. 12వ అధ్యాయములో దేవుడు అబ్రాహామునకు రెండుసార్లు ప్రత్యక్షమైనట్లు ఇంతకుమునుపే చూచితిమి. మూడవసారి దేశము విడచి యొక క్రొత్త దేశమునకు వెళ్ళుమని దేవుడు అబ్రాహామునకు ఆజ్ఞాపించెను. కాని లోతు అబ్రాహాముతో వెళ్ళవలయునని చెప్పలేదు. అబ్రాహాము మానవ మమతను బట్టి లోతును తనతో తీసికొని వెళ్లుటకు ఇష్టపడి లోతు

అబ్రాహాము సోదరుని కుమారుడు. అబ్రాహాముతో ఇట్లు విన్నవించి యుండవచ్చును. ''చిన్నాన్నా! నన్ను కూడ నీతో రానివ్వు!'' మొదట అబ్రాహాము లోతును, నిరాకరించి యుండవచ్చును. కాని, తరువాత అతని కన్నీళ్ళు చూచి సమ్మతించి యుండవచ్చును. పురుషులు అరుదుగా కన్నీరు కార్చెదరు. ఎప్పుడైన, బస్సుస్టాండులోనైన' స్టేషనులోనైన వారి కిష్టమైనప్పుడెల్ల కన్నీరు కార్చే ఆధిక్యత స్త్రీలకు కలదు. డబ్బు కావలసినప్పుడు భర్తల యొద్దనుండి తరచుగా కన్నీరుద్వారా భర్తహృదయము మెత్తన చేయుటకిది బహు శక్తివంతమైన మార్గము. స్త్రీలు కన్నీరు కార్చగలరు లేక తుడిచి వేయగలరు. కన్నీరు వారికి సామాన్యమైన విషయము. కాని పురుషులు కన్నీరు విడచిన యెడల అది సామాన్యమైన సంగతి కాదు. అబ్రాహాము హృదయ మును మెత్తన చేయుటకు లోతు కన్నీరు కార్చి యుండవచ్చును. తుదకు లోతును తనతో తీసికొని వెళ్ళుటకు అబ్రాహాము సమ్మతించి యుండ వచ్చును. మనలో అనేకులము మానవ అభిప్రాయములకు, ఉద్రేకము లకు లొంగిపోయి దేవుడను గ్రహించు శ్రేష్ఠమైన దానిని కోల్పోవుదుము. ఎవరి అప్యాయత వలననో మోసపోయి అనేకమంది విశ్వాసులు తప్పి పోయిరి. దాని ఫలితముగా దేవుడు చెప్పునది వారు వినలేకుందురు. ఆయనకు లోబడ కుందురు.

లోతును తనతో తీసికొని వెళ్లుటకు అబ్రాహాము సమ్మతించెను. కొంతకాలమునకు అబ్రాహాము సేవకులకును, లోతు సేవకులను మధ్య కలహము వచ్చెను (ఆదికాండము 13:7). మానవ మమతలెల్లప్పుడు వివాదమునకు దారితీయును. భర్త' భార్యపిల్లలు, తలిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు, బంధువులు మొదలగు వారియెడల నున్న ప్రతి మమత కూడ యేసుప్రభువుద్వారా పరిశుద్ధ పరచబడవలెనని

మనము జ్ఞాపక ముంచుకొనవలెను. అట్లు పరిశుద్ధపరచబడని యెడల ఒకనాడది తొందర కలుగ జేయును. మనప్రభువు యొక్క తల్లి, సహోదరీలు, సహోదరులు తమకు ఆయన పై అధిక హక్కు కలదని భావించి నట్లు మత్తయి 12:49-50లలో చదువు చున్నాము. ఆయనను చూడ వలెనని ఆయనకు వర్తమానము పంపిరి, కనుక మన ప్రభువైన యేసు ఇట్లనెను., ''నాతల్లి, నా సహోదరులెవరు?'' భర్త యెడల, లేక భార్య యెడల, సహోదర సహోదరీల యెడల, బంధువుల యెడల, మీకున్న మమతలు దేవుని నుండి మిమ్ములను దూరపరచకుండ జాగ్రత్త పడుడి. దేవుని చిత్తమును నెరవేర్చుటకంటె తమ బంధువులను ప్రేమించుటయే కోరుకొను ప్రజలను ఎంతో తరచుగా కనుగొనుచుందుము. ''ఫలానా వారి నెట్లు విడువగలము?'' ఫలనావారి నెట్లు నొప్పించగలము? ఫలానా వారి నెట్లు గాయపరచగలము?'' అని వారు తలంచుదురు. అదే సమయములో దేవుని చిత్తమునకు విరోధముగా జరిగించి పరిశుద్ధాత్మని దుఃఖపరచుదురు.

పరలోక సంగతుల పట్ల లోతునకు ఆశలేదని బహు స్పష్టముగు చున్నది. ఎందుకనగా అతని యెదుట నున్న భూమిని కోరుకొనుమని అబ్రాహాము చెప్పినప్పుడు లోతు సొదొమగొమొఱ్ఱాలకు సమీపములో నున్న మంచి ప్రాంతములను కోరుకొనెను (వ10). లోతు మైదాన పట్టణములలో నివసించి తనగుడారమును సొదొమ వైపుగా వేసికొనెను. ఆ సమయములో సొదొమ, గొమొఱ్ఱాల పరిస్థితి లోతు ఎరుగును. అది రహస్యముకాదు. ఆ పట్టణములు దౌష్ట్యము, అవమానముల విషయమై ప్రతి చోటున ప్రసిద్ధికెక్కి యుండెను. అబ్రాహాము లోతుతో నిట్లనెను. ''నీవు ఎడవైపునకు వెళ్లినయెడల నేను కుడితట్టున కును,'

నీవు కుడితట్టునకు వెళ్ళిన యెడల నేను యెడమ తట్టునకును వెళ్ళు దును.'' సొదొమ, గొమొఱ్ఱాలకు దగ్గర నున్న ప్రాంతమును లోతు కోరు కొనెను. అది సారవంతమైన భూమి యగుటచే అతడు ఆకర్షింప బడెను. అతడిట్లు తలంచి యుండవచ్చును. ''నేను సొదొమ, గొమొఱ్ఱా లలో లేను. నేను వెలుపలనే జీవించ బోవు చున్నాను.'' కాని 19వ అధ్యాయ ములో పట్టణముయొక్క పెద్దలు తీర్పు తీర్చుటకై గవినియొద్దకు వచ్చెడివారు. తర్వాతనే అతడు ఆ పట్టణము నకు నొక పెద్దగా చేయ బడెను. ఆపట్టణమునకు వెలుపలనే నివసించ వలయునని అతడు తలంచి యుండవచ్చును. సొదొమ, గొమొఱ్ఱా ప్రజలు అతనికి పెద్దగా నుండుమని మనవి చేసినప్పుడు, తాను కొంత మేలు చేయగలనని తలంచి యుండవచ్చును. 13వ అధ్యాయము 5వ వచనములో నతడు అధిక ఐశ్వర్యము కలిగి యుండినట్లు చెప్పబడినది. పశువుల మందలతో గుడారములతో నతడు సొదొమకు వచ్చెను. అప్పుడతడు సారవంతమైన భూమిని చూచెను. కొద్దికాలములో బహుగా వర్ధిల్లెను. అతని అభివృద్ధిని బట్టియే సొదొమ గొమొఱ్ఱా ప్రజలు అతనిని పెద్దగా నుండుమని కోరి యుండవచ్చును. ఈ సంగతుల పట్ల అతని వైఖరినిబట్టి, లోతు హృదయ మును బహుస్పష్టముగా చూడగలము. అతడు కీర్తిగాంచెను. అతడెక్కువ భాగ్యవంతుడైనప్పుడు పేరు ప్రఖ్యాతుల కొరకు ఎక్కువ యపేక్షించెను. అదే విధముగా అనేక మంది విశ్వాసులు పేరును, పెత్తనమును అధికార మును, అపేక్షించు చుందురు. ఆత్మీయశ్రద్ధ వలనగాక, పేరు గడించవలె నని వారు సమాజములో నాయకులు కావలయునని ఆతురపడు చుందురు. దయచేసి హెచ్చరిక పొందుడి. ఈ లోక అభివృద్ధి మిమ్మును మోసపరచనియ్యకుడి. తనస్వంత సమయములో దేవుడను గ్రహించు నది ఈలోక భాగ్యము కంటె ఎంతో మేలైనది.

ఆదికాండము 12:1లో అబ్రాహాము కల్దీయుల ఊరును విడచుటలో ఎంతో పెద్ద త్యాగము చేయవలసి వచ్చినను దేవుడు వేరే విధముగా దానికి ప్రతిఫలమిచ్చినట్లు చూచుచున్నాము. ఎక్కువగా పశువులు, ధనము పొందుటకు అతడు సొదొమ గొమొఱ్ఱాలకు పోవలసిన అవసరము లేకపోయెను. దేవుడు తన స్వంత విధానములో అతని యక్కర తీర్చుచుండెను. మన యక్కర తీర్చుటకు దేవుడు తన స్వంత మార్గము కలిగి యున్నాడు. కనుక విశ్వాసులమైన మనము ఎక్కువ ధనము సంపాదించుటకు లోక పద్ధతులను, మార్గముల నవలబించ నగత్యములేదు.

లోతు అతనిని విడచిపోయిన పిదప దేవుడు అబ్రాహామునకు ప్రత్యక్షమైనట్లు 14వ వచనములో చెప్పబడినది. అతడు దేవునికి విధేయుడై లోతునుండి ప్రత్యేకింపబడిన తరువాత అబ్రాహామునకు దేవుడు ఎక్కువ సూచనలిచ్చెను ఆయన అతనితో నిట్లు చెప్పెను. ''ఇదిగో నీకన్నులెత్తి నీవు ఉన్న చోటునుండి ఉత్తరపు తట్టు, దక్షిణపు తట్టు, తూర్పుతట్టు పడమటి తట్టును చూడుము; ఎందుకనగా నీవు చూచుచున్న ఈ దేశమంతటిని నీకును నీసంతానమునకును సదాకాలము ఇచ్చెదను'' (14,15 వచనములు). దేవుడు అబ్రాహామునకును, అతని సంతానమునకును ఎట్టి స్వాస్థ్యమును ఇవ్వగోరి యుండెనో అధికముగా అతనికి చూపించుచుండెను.

ఆయా బోధకులనుండి మన ఆత్మీయ స్వాస్థ్యమును గూర్చి మనము వినినను, తరచుగా దాని భావమును గ్రహించ లేకున్నాము. ఆదికాండము 28 :13-15,30లలో మనము చూచుచున్న యాకోబు వలె అనేకులున్నారు. దేవుడు యాకోబున కెంతో వాగ్దానము చేసెను.

కాని 20వ వచనములో తన శరీర అక్కరలను, కాపుదలను గూర్చియే నతడు తలంచుచుండెను. అతడు ఊహించగలిగిన దానికంటె, తలంచ కలిగిన దానికంటె అధికముగా అతనికి ఇచ్చుటకు దేవుడు వాగ్దానము చేసెను. మన గమనము విశాల పరచబడినప్పుడే ఆత్మీయ సంగతులను మనము గ్రహించగలము. దేవుడు అబ్రాహామును ఉత్తరపు తట్టు, దక్షిణపు తట్టు, పడమర తట్టు, తూర్పు తట్టు చూడుమనెను. మరియు తన స్వాస్థ్యమును విశ్వాసముద్వారా కోరుకొనుటకు ఆ దేశము యొక్క పొడవున వెడల్పున సంచరించుమని చెప్పెను. జీవిత కాలమంతయు దినమునకు ఇరువది నాలుగు గంటలు ఆగకుండ నడచుచుండవలెనని ఊహించుకొనుము. అబ్రాహాము అదే చేయవలసి యుండెను దేవుడు ''మానవ కొలతతో అంచనా వేయలేని స్వాస్థ్యమును నేను నీకివ్వబోవు చున్నాను.'' అని చెప్పి నట్లుండెను.

మన విషయములో మన ఆత్మీయ విస్తరణ ద్వారా దేవుడను గ్రహించిన స్వాస్థ్యమును తెలిసికొనగలము. దాని అంచనా వేయగలము. విశాలమైన ఆత్మీయ దర్శనము పొందుటకు మన మనేక పరిస్థితుల ద్వారా పోవలసి యుండును. దేవునితో, జీవముగల దేవునితో సహవాసము గలిగి యుండుట ద్వారానే నతడు దేవుని మార్గములు గ్రహించగల డని దేవుడు అబ్రాహామునకు చూపించు చుండెను.

దేవుని సహవాసము కంటె, బైబిలు జ్ఞానమునే అనేకులు ఎక్కువ గా తలంచుచుందురు. బైబిలు చదువునప్పుడు, ప్రసంగమిచ్చునప్పుడు వారు అలసిపోరు. బైబిలు పఠనమునందు వారు ఆనందించు చుందురు. కాని దేవుని సహవాసము యొక్క అక్కరను గ్రహించుటకు వారికి కష్టముగా నుండును. వారి మోకాళ్ళను, వీపులను నిందించెదరు. వీపు

నొప్పిగా వున్నప్పుడు మోకాళ్ళ మీదెట్లుండ గలను? దయచేసి మీ హృదయములను చిందించుడి. మీ కాళ్ళనుకాదు. జీవముగల దేవునితో సమయము గడుపుట కష్టము. ఎందుకనగా మీ తలంపులు, భావములు మిమ్ము‌ను తొందర పెట్టుచున్నవి లేక అవి అటుయిటు సంచరించు చున్నవి. అయినను జీవముగల దేవునితో సహవాసం కలిగి యుండుట ఆశీర్వాదమును, నూతనత్వమును చేకూర్చును ( యెష. 40:31 ). జీవ ముగల ప్రేమగల దేవునితో యధార్థమైన సహవాసము గలిగి యుండుట ద్వారా నీవు అధిక బలముపొందెదవు.

దేవుడు అబ్రాహామును హెబ్రోనులో కలిసికొనెను. అతడచట నొక బలిపీఠమును కట్టెను. దానిద్వారా తనను నీతిమంతునిగా చేసిన దేవునికి కృతజ్ఞత చెల్లించుట కారంభించెను. ఎంత ఎక్కువగా మనము దేవుని ఆరాధించెదమో, అంత ఎక్కువగా ఆయన సత్యమైన సహవా సమునందు ఆనందించగలము. ప్రయత్నించి చూడుము. నీవు మోకాళ్ళ మీదుండినప్పుడు ఏదో విన్నపమునో, మనవినో తలంచుకుము. కాని, నిన్ను నీతిమంతునిగా చేయుటకాయన చేసినదానినిబట్టి ఆయనకు కృతజ్ఞత చెల్లించుము. ఆయనతో నిట్లు చెప్పుము. ''ఓ ప్రభువా! నీతో నీ సన్నిధిలో వుండాలనే కోరికతప్ప నాకు వేరే మనవి లేదు. నీవు నాతో ఉన్నావని భావించుటకు నీ సన్నిధిలో నుండగోరుచున్నాను''. అట్టి సహవాసము నిన్ను పురికొల్ప జేయును, అప్పుడాయన నీయెడల తన చిత్తమును చూపించ గలుగును.

❖❖

## అధ్యాయము - 3

# ఆత్మీయ ఆహారము యొక్క అవసరత

ఇద్దరు సన్నిహిత స్నేహితులు ఒకరి రహస్యము లొకరితో పంచుకొన గలుగునట్లు మనముకూడ ఆయన స్నేహము నందు ఆనందించుచు, ఆయన రహస్యములను పంచుకొనవలయునని ప్రభువు కోరుచున్నాడు. దీనిని చేయగలుగుటకు, ఆయనతో ధారాళముగా మాట్లాడుటకును, స్పష్టముగ ప్రతిదినమాయన స్వరము వినుటకును మనము నేర్చుకొనవలయును. మన జీవిత మందలి ప్రతి చిన్న విషయమందును మనమాయనచే నడిపించ బడవలెను. అనుదినము ప్రార్థనా పూర్వకముగా మౌనధ్యాన సమయమును మనము గడిపినయెడల, యేసుక్రీస్తు ప్రభువు తన వాక్యముద్వారా మనతో మాట్లాడుటయు, జ్ఞానులకును, వివేకులకును మరుగుపరచబడిన అనేక రహస్యములను మనకు చూపించుటయు కనుగొనగలము. కాని ఆయన స్నేహము సంపాదించుకొనుటకు మనమాయనపట్ల యథార్థముగా ప్రవర్తించవలెను.

ఆదికాండము 12:22లో దేవుడు అబ్రాహామునకు నలువది సంవత్సరముల వ్యవధిలో పది పర్యాయములు ప్రత్యక్షమై నట్లుగా చూచుచున్నాము. 12వ అధ్యాయములో మొట్టమొదటిసారిగా రెండవసారి ఆయన ప్రత్యక్షమయ్యెను. 13వ అధ్యాయములో మూడవ సారి ప్రత్యక్షమయ్యెను. మరల 14వ అధ్యాయములో నాల్గవసారి మెల్కీసెదెకు రూపములో తన్నుతాను బయలు పరచుకొనెను. ఆసమయములో అబ్రాహాము సొదొమ రాజు యొక్క శత్రువులతో పోరాడి,

వారిని ఓడించి తిరిగి వచ్చుచుండెను. ఈ శత్రువులు సొదొమ రాజును పట్టుకొని చెరగా తీసికొనిపోవుటయేగాక, ఆ సమయములో సొదొమలో నివసించుచున్న అబ్రాహాము అన్న కుమారుడైన లోతును కూడ చెరగా తీసికొనిపోయిరి. అబ్రాహాము లోతును, అతని కుటుంబమును, అతని ఆస్తిని, అతనితోనున్న మనుష్యులనుకూడ విడిపించెను(వ.16). అదే సమయములో సొదొమ రాజును, అతని మనుష్యులను అతడు విడిపించెను.

సొదొమరాజును, అతని తోడి కుట్రదారులైన మరి నలుగురు రాజులును, వేరే ముగ్గురు రాజులచేత ఓడింపబడిరి. అబ్రాహాము తన మనుష్యులలో కొద్దిమందితో వెళ్ళి ఆ జయించిన రాజులను ఓడించెను. అతని మనుష్యులను, సమస్త ఆస్తిని విడిపించినందులకు సొదొమరాజు అబ్రాహామునకు ఎంతో కృతజ్ఞుడుగా నుండెను. అతడు అబ్రాహాము నొద్దకు వచ్చి, ఉదారబుద్ధితో, మనుష్యులను నాకిచ్చి ఆస్తిని నీవే తీసికొనుము'' అని పలికెను. అబ్రాహామునకిది మిక్కిలి పెద్ద శోధనగా వుండెను. కాని, మెల్కీసెదెకు ద్వారా దేవుడు అతనితో మాట్లాడినప్పుడే దీని కొరకతనిని సిద్ధపరచెను.

సొదొమ గొమొఱ్ఱా ప్రజలెంత దుర్మార్గులో ఇంతకు మునుపే చూచియుంటిమి. దేవుని దృష్టిలో వారు అపవిత్రులు, వారికి కలిగిన సమస్తమును అపవిత్రమైనదే. సొదొమరాజు చేతి నుండి ఆ అపవిత్రమైన ఆస్తిలో నొక వస్తువునైనను అబ్రాహాము అంగీకరించుట దేవుని చిత్తము కాదు. కావున, సొదొమరాజు ఆస్తి ఇచ్చెదనని చెప్పుటచే అబ్రాహామునకు వచ్చిన శోధనను జయించుటకు కావలసిన అధికమైన బలము

ననుగ్రహించు టకే ఆదికాండము 14:18లో దేవుడు మెల్కీ సెదెకును అబ్రాహాము నొద్దకు పంపెను. హెబ్రీ 7:1-3లలో మనము చూచుచున్న రీతిగా మెల్కీసెదెకు మహోన్నతుడగు దేవుని ప్రధాన యాజకుడు- ''అతడు తండ్రిలేని వాడును, తల్లిలేనివాడును వంశావళి లేని వాడును జీవితకాలమునకు ఆదియైనను జీవితమునకు అంతమైనను లేనివాడనై యుండి, దేవుని కుమారుని పోలియున్నాడు. ..... నిరంతరము యాజకుడుగా నున్నాడు.'' మెల్కీసెదెకు రొట్టెను, ద్రాక్షరసమును తనతో తెచ్చి అబ్రాహాము నాశీర్వదించెను. ఇది శోధన జయించుటకు అబ్రాహాము కవసరమైన ఆత్మీయ ఆహారము. ఈ రీతిగా మెల్కీసెదెకు మనకు జీవాహారముగాను, గొప్ప ప్రధాన యాజకుడు గానైన యేసుక్రీస్తు ప్రభువునకు మాదిరిగా నున్నాడు.

యోహాను 6:18 నుండి మొదలుకొని యేసుక్రీస్తు ప్రభువు మనకు జీవాహారమాయెనను తలంపు ఏడుమార్లు చెప్పబడినది. యేసు ప్రభువును మనమెట్లు తినగలము, ఎట్లు త్రాగగలము? ఆయనను మన ఆహారముగాను, పానముగా నెట్లు చేసికొనగలము? విశ్వాసముద్వారా, పరిశుద్ధాత్మ సహాయముతో ఏ స్థలమందైనా, ఏసమయములోనైనా మనమట్లు చేయగలము. మనకు దాహముగా నున్నప్పుడు నీరు త్రాగు నట్లు, ఆకలిగా నున్నప్పుడు ఆహారము తినునట్లు, ఆత్మీయముగా మన మాకలి, దప్పిగొనినప్పుడు యేసు క్రీస్తు ప్రభువును తినవచ్చును, త్రాగ వచ్చును. ఈ రీతిగా ఏ శోధననైనా మనము జయించగలము. మనమంద రము ప్రతి దినము అనేక శోధనలకు గురియగుచుందుము. యేసుక్రీస్తు ప్రభువును మన అనుదిన ఆహారము, పానీయముగా చేయుట ద్వారా

దేవుడు మన విజయము కొరకైన ప్రేమగల ఏర్పాటును చేసెను.

అబ్రాహాము దూర ప్రయాణము చేసి, చివరకు శత్రువును కలిసికొని, పోరాడినందున అలసి, వేసారియుండెను. అతని చెప్పులరిగి పోయెను. నిస్సందేహముగా చెప్పుల వారు అతని కవసరమై యుండెను. సొదొమరాజు పూర్ణ కృతజ్ఞతతో వచ్చి, అబ్రాహాము విడిపించిన ఆస్తి నంతటిని యతనికే సమర్పించుచు, ''మనుష్యులను నాకిచ్చి, ఆస్తిని నీవే, తీసికొనుము'' అని పలికెను. ఎట్టి శోధన! కాని అబ్రాహాము, ''నావస్త్రములు చినిగి యుండినను, చెప్పులరిగియుండినను, వస్త్రములను కుట్టుకొనుటకు నూలుపోగునైనను, చెప్పులు బాగుచేసి కొనుటకు చెప్పుల వారునైనను నేనంగీకరించను. నాకు ఆకలిగా నున్నను, నీ ఆహారములో దేనిని ముట్టను.'' అని సమాధాన మిచ్చెను. దీనంటి నుండి మనము నేర్చుకొనగలుగునదేమనగా, తాను భలవంతుడై యుండు టను బట్టియు తనకా ఆస్తితో అవసరము లేకుంటను బట్టియు, తనకా ఆస్తితో అవసరము లేకుండుటను బట్టియు అబ్రాహాము ఆ ఆస్తిని నిరాక రించలేదు: కాని, తన సమస్త అక్కరకొరకు, చెప్పులవారు కొరకు కూడా దేవునిపైనే సంపూర్ణముగా నాధారపడుదునని యతడు చూపించగోరెను. ఇది మొదటి తలంపు.

రెండవ తలంపేమనగా : సొదొమ. గొమొఱ్ఱా రాజుల యొక్క అపవిత్రమైన వస్తువులచే తన్ను అపవిత్రపరచుకొనుట కతడు నిరాక రించెను. అందువలననే యతడు ఒక నూలుపోగునైనను, చెప్పుల వారునై నను, రొట్టెముక్కనైనను తీసికొనుటకు ఒప్పుకొనలేదు. మనకు చాలా ఆకలిగా, దప్పికగా, నున్నప్పుడు అనేక శోధనలు కలుగును. మన సమస్త

అక్కరల కొరకు దేవుని నమ్ముకొను విషయములో సందేహములు కలుగును. బోధకు లనేకులు, దేవుని సేవకులని పిలువ బడేవారు దేవుని సేవకులు కానేకాదు. ఏదోనొక విధమున అనేక వస్తువుల కొరకు భిక్షమెత్తు చుందురు. వారు భారతీయులైనను, అమెరికనులైనను, ఇంగ్లీషు వారైనను ఏబేధములేదు. భారతదేశములో భిక్షమెత్తుటకు పాతదుస్తులు ధరించు దురు. కాని ఇంగ్లండులో మంచి దుస్తులు ధరించుకొని, బూట్లు కట్టుకొను త్రాళ్ళనో లేక అగ్గిపెట్టెలనో లేక కలములనో లేక ఇట్టి వస్తువేదో నొకదానిని అమ్ముచున్నట్లుగా మార్గము ప్రక్కన నిలుబడి యుందురు. వారినిజమైన పని వస్తువుల నమ్ముటకాదు. వారు డబ్బు అవసరతలో నున్న వారను సత్యము స్పష్టముగా నగపడుటచే దయార్ధ్రహృదయులైన మనుష్యులు ఒక అగ్గిపెట్టెను తీసికొని, అయిదు రూపాయల కాగిత మును వారి చేతిలో నుంచి మిగిలిన డబ్బును వారినే ఉంచుకొనమం దురు. బహిరంగముగా భిక్షమెత్తుట నిషేధించబడినది. ఏది ఏమైనను అది భిక్షమెత్తుటయే. అదేరీతిగా కొందరు దైవసేవకులు తాము దేవుని సేవించు చున్నా మనుచుందురు. కాని ఉత్తరములద్వారా, ఫోటోలద్వారా డబ్బుకొరకు భిక్షమడుగు చుందురు. ఈకారణమును బట్టి తమ పనిని గురించిన సమాచారమయులను పంపించు చుందురు. వారికి ఎక్కువ ధనముకావలెను. వారికి తృప్తిలేదు. కనుకనే వారు కొరతలో నిలిచియుండి ఆత్మీయముగా గొడ్డుపోయిన స్థితిలో నుందురు. కాని నీవు దేవుని నమ్ము కొనిన యెడల నీ సమస్త కొరతలను, చెప్పులవారు వంటి కొరతను కూడ ఆయన తీర్చును. సహాయము కొరకు సొదొమ రాజు నొద్దకు వెళ్ళకుము. ఇట్లుచేసి విశ్వాసులనేకులు తమ విశ్వాసమును కోల్పోయిరి. వారు ఒక

ఉద్యోగమునో లేక పైపదవినో పొందుటకు లోకస్తుల యొద్దకు వెళ్ళెదరు. లోక పద్ధతుల నవలంబించెదరు. వారి వివాహములకు కావలసిన డబ్బు నిమిత్తము, చిన్నాయన, పెద్దనాయనలను, చినమ్మ పెద్దమ్మలను నమ్ముకొందురు.

సొదొమరాజు ఇచ్చిన దానిని అంగీకరించే శోధనకు అబ్రాహాము తాళుకొనగలుగుటకు, అతాడాత్మీయాహారమును పొందెను. అట్లు బలపర్చబడినవాడై శోధన వచ్చినప్పుడు జయించ గలిగెను. అనుదినము విశ్వాసము ద్వారా యేసుక్రీస్తు ప్రభువును మనము తినవలెను, త్రాగవలెను. ఆయనతో నిట్లు చెప్పుము, ''యేసు ప్రభువా! నీవు నా ఆహారము, నా పానీయము. నన్ను తృప్తి పరచి నాకు అంతరంగిక బలము ననుగ్రహించుము. ఈదినము నామార్గములో రానున్న శోధనల నెదుర్కొనుటకు నన్ను ఆయత్తరపచుము. సొదొమ వస్తువులచే నపవిత్ర పరచబడకుండ నన్ను కాపాడుము. నీయందు మాత్రమే నమ్మిక యించుటకు నాకు సహాయము చేయుము''. ఆయన నీ విశ్వాసమును ఘన పరచును.

అబ్రాహాము తనకున్న దానంతటిలో నుండి దశమ భాగమును మెల్కీసెదెకున కిచ్చెను. దేవుని సహాయముచేతనే తాను శత్రువులను ఓడించగలిగెనని చూపించుట కతడట్లు చేసెను. ఆ దేవుడే భవిష్యత్తులో తన సమస్త అక్కరలను తీర్చునని అతడు ఒప్పుకొనుచుండెను. దశమ భాగములనిచ్చుట ద్వారా మనము కలిగియున్న సమస్తమాయన యందు కలిగి యున్నామని సూచించుచున్నాము. అవి ఏవైనను మన సమస్త అక్కరలు దేవుడు తీర్చగలడని నమ్ముచున్నామని కూడ సూచించు

చున్నాము. సహాయము ఈ లోక స్నేహితుల వైపుగాని, బంధువుల వైపుగాని చూడమని దానిద్వారా దేవునితో చెప్పుచున్నాము.

భారతదేశములో ఆహార కొరత యున్న దినములలో అమెరికాకు లేక వేరే దేశములకు సమాచారములు పంపెడి శోధన కలదు. వారికి డబ్బు కావలయునని నేరుగా చెప్పరు. కాని భారతదేశములో గొప్ప ఆహార కొరత యున్నది. కనుక కలకత్తాలోనో లేక వేరే స్థలములోనో అనేకులు ఉపవాసముంటున్నారని చెప్పెదరు. తీరా డబ్బు వచ్చినప్పుడు అందులో ఇరువదియైదు శాతము భార్యాపిల్లలకు పోతుంది. ఇరువదియైదు శాతము మరో కారణము నిమిత్తమును, కొద్ది శాతము మాత్రము ఉపవాస ముంటున్న వారికి పోతుంది. ఎట్టి వేషధారణ! అట్టివారు తమ్మును తాము మోసపరచు కొనుచు, ఇతరులను మోసగించుచు, దేవునియందలి విశ్వాసమును కోల్పోవుచున్నారు. అబ్రాహాము దేవుని ఘనపరచినట్లు. మనము కూడ ఘనపరచిన యెడల, దేవుడు మనలను ఘనపరచును. మన సమస్త అక్కరలను తీర్చును.

❖❖

# అధ్యాయము - 4
# దేవుని నిబంధన

ఆదికాండము 15వ అధ్యాయములో అబ్రాహామునకు మన దేవుని అయిదవ ప్రత్యక్షత యున్నది. అతని విశ్వాసమును పరీక్షించుటకప్పుడు దేవుడు ప్రత్యక్షమాయెను. ''దేవుని సర్వాంగ కవచము''లో విశ్వాసమను డాలు (ఎఫెసీ. 6:16)లో మన కియ్య బడినది. ఎందుకనగా బలమగు సజీవమైన విశ్వాసము ద్వారా మాత్రమే శత్రువును ఓడించగలము. మార్కు. 11 : 22లో ప్రభువు దానిని ''దేవుని విశ్వాసము'' (ఇంగ్లీషు బైబిలు మార్జిన్‌లో నియ్యబడి నది) అని పిలుచుచున్నాడు. గలతీ. 2:20లో అది ''దేవుని కుమారుని విశ్వాసము'' అని వివరించబడినది. దేవుడు తనంతట తానే మనలో నివసించు నప్పుడు మాత్రమే బలమైన విశ్వాసము కలిగి యుండగలము. దేవుడు ఈ దర్శనములో, ఆదికాండము 15వ అధ్యాయమునందు అబ్రాహాము తో, ''అబ్రాహామా ! నన్ను, నామాటను నమ్ముము'' అని చెప్పెను.

దేవుడు ఇంకా ఇట్లనెను. ''నేను నీకు కేడెమును. నీ అత్యధిక బహుమానమును'' కీర్తనలు 84:11లో దేవుడు ''సూర్యుడును, కేడెమునై'' యున్నట్లుగా వివరింపబడెను. బహుమానము, విశ్వాసముపై నాధారపడి యున్నది. నిజమగు చురుకైన విశ్వాసము లేకున్న యెడల బహుమానమును పొందలేము. మనకు విశ్వాసము ననుగ్రహించుటకు ప్రభువు శ్రమలను, పరీక్షల నుపయోగించును (1 పేతురు 1:7). దేవుడు స్పష్టముగా అబ్రాహాముతో మాట్లాడెను. అయినను నమ్ముట

కతనికి కష్టముగా నుండెను (ఆదికాం. 15:2, 3). అబ్రాహాము అనేక సంవత్సరములు వేచియుండి, తనకు పిల్లలు లేరను సంగతి గుర్తించి. తన ఆస్తిని తన ప్రధాన గృహ నిర్వాహకుని పేరట పెట్టుచు వీలునామా తయారు చేసెను. ఈ పొరబాటునుండి అతనిని రక్షించుటకు దేవుడ తనికి ప్రత్యక్షమయ్యెను. మన హద్దుబాటుల వలన తరచుగా అనేక సందేహములకు గురియగుచుందుము. మనకు బలమైన విశ్వాస ముండినను కొన్ని పర్యాయములు మనలను తొందర పెట్టుటకు సందేహములు తిరిగి కలుగుచుండును. మరియు దేవుడు తన కృపా కనికరముల చొప్పున మరల మరల జోక్యము చేసికొనుచుండును.

చివరికి దేవుడు తానే అబ్రాహామునకు సరియైన సమయములో ప్రత్యక్షమాయెను. అతనిని వెలుపలికి పిలిచి ఇట్లనెను. ''అబ్రాహామా, ఆకాశమువైపు చూడుము. నీవెపు, నీభార్యవైపు లేక నీహద్దుబాటులను, నీభార్య హద్దుబాటులను చూడవద్దు. పరిస్థితుల వైపు చూడవద్దుగాని పైకి చూడుము. అప్పుడు ఆ విశ్వాసము బలపడును. ఆకాశము తట్టు చూచి నక్షత్రములను లెక్కించుము. నీ సంతానము కూడ నటులనే యుండును.

ఈ దినము వరకు నక్షత్రములసంఖ్య ఎవరికిని తెలియదు. అవి అనేకములుగా బహు దూరములోనున్నవి. అతడు నక్షత్రములను లెక్కించలేడని దేవుడెరుగును (వ 5-8). కాని అతని విశ్వాసమును బలపరచవలెనని ఆయన ఉద్దేశించెను. పైకి చూచుట ద్వారానే మనము విశ్వాసమును కలిగి యుండగలము. శత్రువు మనలను క్రిందికి, మన హద్దుబాటులను, మన లోపములను, మన పతనములను చూచుకొను

నట్లుగా చేయును. యెడతెగకుండ మన నేత్రము లాయన మీద నుండవలెను. విశ్వాసము ద్వారా ఆయన వాగ్దానములను చేపట్టవలెను.

యిర్మీయా 24:18 ఈ వాక్యభాగము కొంత స్పష్టపరచు చున్నది. ఆ దినములలో రెండు గుంపులవారు నొక ఒప్పందము చేసికొను నప్పుడు నొక జంతువును తీసికొని, దానిని చంపి రెండు ఖండములుగా చేయుదురు. ఆ రెండు గుంపులవారు ఆ జంతు ఖండముల మధ్యగా నడచి వెళ్ళుటద్వారా తప్పిపోని వాగ్దానమును చేసికొందురు. అదే రీతిగా దేవుడు అబ్రాహాముతో నొక నిబంధన చేయుచుండెను. ఆయన మూడు జంతువులను, రెండు పక్షులను (వ. 10, 15, 17) తీసికొని వాటిని చంపి రెండు ఖండములుగా చేయుమని యతనితో చెప్పెను. అప్పుడు దేవుడు ఆ ఖండముల మధ్యగా నొక మండుచున్న జ్వాల నడచి పోవు నట్లుగా చేసెను. అట్లు దేవుడు తప్పిపోని నిబంధనను అబ్రాహాముతో చేసెను. (వ. 13-17).

అబ్రాహాము దేవుని మాటలు వినుచుండెను గనుక అతని సంతానము ఒక జనాంగముగా ఐగుప్తులో నాలుగువందల సంవత్సరములుండి, నాల్గవ తరములో తమ దేశమునకు తిరిగి వచ్చెదరని దేవుడతనికి ముందుగానే చెప్పగలిగెను. ఆరీతిగా దేవుడు ఆ దేశప్రజలైన అమోరీయులకు, హిత్తీయులకు వారి పాపముల నిమిత్తము పశ్చాత్తపపడుటకు నాలుగు శతాబ్దము అను గ్రహించెను. వారి పాపముల విషయమై పశ్చాత్తాపపడక పోయిన యెడల వారు తీర్పు పొందెదరు. ఇశ్రాయేలు జనాంగము ఐగుప్తు దేశమునుండి తిరిగి వచ్చినప్పుడు ఆ దేశము యొక్క అపవిత్రత వివరము లేవికాం. 18:28-25లలో నియ్యబడినది. అచట నివసించుచున్న

జనాంగముల వారు పశ్చాత్తాపపడుటకై దేవుడు నాలుగు శతాబ్దములు వేచి యుండెను. వారు పశ్చాత్తాపపడనందున వారికి తీర్పు తీర్చవలసి వచ్చెను. సమస్త పట్టణములను, అందున్న వారి నందరిని సమూల నాశనము చేయుమని దేవుడు ఇశ్రాయేలు జనాంగమునకు సెలవిచ్చెను.

యేసుక్రీస్తు ప్రభువు తన రక్తము ద్వారా ఈనాడు మనతో నొక నిబంధన చేసెను. ఆ నిబంధన ద్వారా ఆయన స్వాస్థ్యమును మనము పొందుచున్నాము. అదే సమయములో ఇతర శక్తులకు తీర్పు తీర్చుటకు ఆయన మనలను వాడుకొనును (1 కొరింథీ 6:2,3). అట్టి ఆధిక్యత కొరకు బలమగు చురుకైన విశ్వాసము మన కనుగ్రహించబడవలెను. అట్టి విశ్వాసము అనుమానములను జయించును. ఆయన మనతో మాట్లాడి నప్పుడు విని, లోబడవలెను.

❖❖

## అధ్యాయము - 5

# విశ్వాసము ద్వారా శక్తి

దైవ స్నేహమునకు పదంతల రహస్యమున్నదని ఇంతకు మునుపే చూచి యుంటిమి. ప్రతి ప్రత్యక్షతలో దేవుడు అబ్రాహామునకు ఈ రహస్యములో కొంత భాగమును క్రమక్రమముగా బయలుపరచు చుండెను.

మీ యింటిలో మెట్లుండిన యెడల వాటిని దూకి వెళ్ళరు గాని మెట్టు తరువాత మెట్టు ఎక్కెదరు. అబ్రాహాము యెడల కూడ నట్లే జరిగెను. దేవుడు రెండు సార్లు అబ్రాహామునకు ఆదికాండము 12, 13, 14, 15 అధ్యాయములలో ప్రత్యక్షమయ్యెను. అతడు 99 సంవత్సరముల వయస్సు గల వాడైనప్పుడు, ఒక మనుష్యుడు కుమారుని పొందగలిగిన వయస్సు అతడు దాటిపోయినప్పుడు దేవుడతనికి 6వసారి ప్రత్యక్షమైనట్లు 17వ అధ్యాయములో వ్రాయబడినది. ఇద్దరును, అతడు, అతని భార్య కూడ ఎండిన చెట్లవలె మారిపోయిరి. అటువంటి సమయములో, అతడు వృద్ధుడైనను అతని భార్య కూడ వృద్ధురాలైనను, దేవుడు తన వాగ్దానమును నెరవేర్చగలడని అతడు నమ్మవలసి వచ్చెను (రోమా 4:19-24).

అట్టి సమయములో సహితము అబ్రాహాము నిజమైన విశ్వాసమును కలిగియుండెను. ఇటువంటి విశ్వాసమతనిలో నుండవలెనని దేవుడు 25 సంవత్సరములు వేచి యుండెను. మొదట దేవుడతనికి ప్రత్యక్షమైనప్పుడతడు విశ్వాసము కలిగి ఉండెను. కాని అది బలమైన

విశ్వాసముకాదు (హెబ్రీ. 11:8). అతడు దేవునికి లోబడి వెంటనే తన దేశమును బంధువులను విడచి ఒక క్రొత్త దేశమునకు వెళ్ళెను. ఈ రీతిగా లోబడుటకు అధిక త్యాగము, విశ్వాసము అతడు కలిగి ఉండినను దేవుడు తృప్తి చెందలేదు. పిల్లలను కనుటకు అతడు, అతని భార్య వృద్ధులగు వరకు ఆయన అబ్రాహామును బలమైన విశ్వాసము నిమిత్తమై క్రమ క్రమముగా సిద్ధపరచుచుండెను. దేవుడు నూతన జీవమును వారి దేహములలో పోయునంతవరకు. వారు బిడ్డను పొందలేకపోయిరి. మరొక రీతిగా వారు ఎండిన చెట్లువలెనున్నారు గనుక వారు నూతన జీవమును పొందవలసి వచ్చెను. దాని ద్వారా వారు పునరుత్థానశక్తిని గురించి కొంత గ్రహించగలిగిరి. అదే శక్తి ద్వారా మనము కూడ మన శోధనలను జయింపగలము.

అపొస్తలుడైన పౌలు ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రికలో ''ఆయనను, ఆయన, పునరుత్థాన బలమును ఎరుగు నిమిత్తమును'' అని ఎంతో ఆశతో పలుకుట చూచుచున్నాము. జరిగి పోయిన సంవత్సరములలో తన పరిచర్యద్వారా అనేక మహత్కార్యములు జరుగుట నతడు చూచి ఉండినను దేవుడతని ద్వారా ఆయన పునరుత్థాన బలమును ఎరుగు నిమిత్తమును ..... సమస్తమును నష్టపరచుకొని వాటిని పెంటతో సమానముగా ఎంచుకొనుచున్నాను'' అని పలుకుచున్నాడు. పునరుత్థాన శక్తి. విశ్వాసుల కందుబాటులోనున్న సర్వోన్నతమైన శక్తి విశ్వాసులనేకులు తమ జీవితములో శక్తి కలిగి ఉండవలెనని వెదకుచు, ఎన్నో సంవత్సరముల కొలది ప్రణాళికలు, ఏర్పాటు చేసికొను చుండెదరు. వారి జీవితములో అనేక పతనములను ఎదుర్కొన కలిగినను, ఆత్మీ

యముగా గొడ్డుతనములోనే ఉండెదరు. అప్పుడు తమ శోధనలపై శక్తినెట్లు పొందగలమాయని ఆలోచింప మొదలు పెట్టుదురు. స్వప్నములు కలుగుటద్వారా లేక కొన్ని యనుభవములు, దర్శనములు పొందుట ద్వారా తాము శక్తి పొందగలమని తలంచుదురు. కాని వారింకను బలహీనముగానే ఉండెదరు. పునరుత్థానశక్తి అందుబాటులో నున్నదని వారు గుర్తించరు. యేసుక్రీస్తు ప్రభువు మన పాపముల నిమిత్తము మనకు బదులుగ చనిపోయెనని, మనలను నీతిమంతులనుగా తీర్చుటకును మనలో జీవించుటకును ఆయన తిరిగి లేచెనని నమ్మిన యెడల, అప్పుడు అనుదినము విశ్వాసముద్వారా మన ప్రతి పరిస్థితికొరకు, ప్రతి శోధనలో ప్రతి అక్కరలో పునరుత్థాన శక్తిని పొందగలము.

అట్టి విశ్వాసమును మన కనుగ్రహించుటకు ప్రభువనేక బాధకరమైన పరిస్థితులద్వారా, పరీక్షలద్వారా మనలను నడిపించును. 1 కొరింథీ. 1 : 11లో ఆ తలంపును చూచు చున్నాం. బంగారు అగ్నిచే శుద్ధీకరింపబడవలెను. సబ్బుచేతగాని, అది శుద్ధీకరించబడనేరదు. ప్రతి అల్పమైన మష్టు కాల్చబడువరకు బంగారము శుద్ధీకరించు అగ్ని యొద్దకు మరలా మరలా తేబడును. అదే విధముగా అనుమానముల నుండి, అవిశ్వాసము నుండి విడిపించ బడుటకు శుద్ధీకరించు అగ్నిద్వారా మనము పోవలయును. మనకు విశ్వాసమనుగ్రహించబడెను. అది బలమైన విశ్వాసమని తలంచు చుందుము. ఒక ప్రశ్న : మన విశ్వాసము ప్రభువునకు తృప్తి కలిగించెనా ? అనుదినము విశ్వాసముద్వారా ఆయన పునరుత్థాన శక్తిని మనము అన్వయించుకొంటేనేగాని ప్రభువునకు తృప్తి కలుగదు. గలతీ 2 : 20లో పౌలు, ''క్రీస్తే నాయందు జీవించు చున్నాడు'' అని పలికెను.

ఎందుకనగా సజీవుడైన క్రీస్తే నీ కొరకు, నా కొరకు మరణమును జయించెను. ఆయన పునరుత్థాన శక్తి యందలి విశ్వాసముద్వారా అనుదినము మన శోధనలు జయించుటకు సజీవుడైన క్రీస్తే మనయందు జీవించుచున్నాడు.

పౌలు, అపొల్లో, తిమోతి మొదలగువారి ద్వారా ఎఫెసులో నున్న వారు నేర్పించబడినను క్రీస్తును మృతులలోనుండి లేపుటలో దేవుడు ప్రత్యక్షపరచిన శక్తియొక్క అపరిమితమైన మహాత్మ్య మెట్టిదో వారు తెలిసికొనవలెనని పౌలు వారికొరకు ప్రార్థించెను (ఎఫెసీ. 1 : 16-20). అతడెందుకట్లు ప్రార్థించెను? ఎఫెసీ. 1 : 3లో నతడు, ''మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క దేవుడు స్తుతింపబడునుగాక. ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో, ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మన కనుగ్రహించెను'' అని పలికెను. అట్టి ఆశీర్వాదము నిమిత్తము ఆయన పునరుత్థాన శక్తి మనలోనికి ఎట్లు రాగలదో మనము నేర్చుకొన వలెను. అట్టి జ్ఞానమును, విశ్వాసమును పొందునట్లు పరీక్షల ద్వారా, శమల ద్వారా ఇబ్బందులద్వారా, కష్టములద్వారా ప్రభువు మనలను తీసికొని పోవును.

అబ్రాహామునకు దేవుడు పది పర్యాయములు ప్రత్యక్ష మైనట్లు గానే, పునరుత్థానమునకు పిమ్మట పది పర్యాయములు ప్రభువు శిష్యులకు ప్రత్యక్షమయ్యెను. మొదట ఆయన సమాధి నొద్ద మరియకు ప్రత్యక్ష మయ్యెను. తరువాత అచ్చటి మనుష్యులకు, పేతురునకు, ఎమ్మాయికు పోవుచున్న శిష్యులకు ఆ సాయంకాలమున మైగదిలోనున్న శిష్యులకందరికి కనబడెను. పిమ్మట ఐదువందల మందికి యాకోబునకు, తోమాకు,

గలిలయ సముద్రమునొద్ద, చివరగా ఆయన పర లోకమున కారోహణుడై నప్పుడు బేతనియయొద్ద కనబడెను. ఈస్టరు దినమున ఐదు ప్రత్యక్షతలు, ఆరోహణ దినమునకు ముందు మరి ఐదు ప్రత్యక్షతలు, పునరుత్థానశక్తి యొక్క పదంతల మర్మమచ్చట శిష్యులకు కలిగిన ప్రభువు యొక్క ప్రత్యక్షతలను చేర్చి పఠించిన యెడల చాలా సహాయకరముగా నుండును. ఆది కాండము 17 : 1లో దేవుడు, ''నేను సర్వశక్తిగల దేవుడను'' అని సెలవిచ్చెను. దేవుని బలమైన శక్తిని అబ్రాహాముకు అనుభవింప జేయుటకు ఆయనట్లు చెప్పెను. ''నేను సర్వశక్తిగల దేవుడను నాకసాధ్యమైన దేదియులేదు''. దేవుని కసాధ్యమైన దేదియులేదు. ఆయన సమస్తము చేయగలడు, ప్రేమకనికరములుగల దేవుడు క్రీస్తుయొక్క పున రుత్థానశక్తిని అనుభవించి, ఆనందించగలిగే విశ్వాసము మనము కలిగి యుండవలెనని కోరుచున్నాడు. అబ్రాహాము వృద్ధుడైనప్పుడు, కర్రపట్టు కొని నడచియుండ వచ్చును. ఎందుకనగా, మనము వృద్ధులైనప్పుడు, బలహీనులమై నీరసించి, నిస్సహాయుల మౌదుము. కనుక అబ్రాహాము కర్ర పట్టుకొని నడచుచు, ఎంతో నిరాశతో, ''నీకు కుమారుని ఇచ్చెదనని దేవుడు నాతో చెప్పెను. కాని ఇంకను బిడ్డ జన్మించ లేదు.'' అని తలచియుండ వచ్చును. కనుక అనేక సందేహములు తన మనస్సులోగల వాడై, కర్రనానుకొని బలహీనముగా, నీరసముగా నున్నట్లు భావించు చుండెను. అప్పుడు దేవుడు అబ్రాహాముతో, ''ఆ కర్రను పారవేసి నిటారుగా నడువుము. ఇక మీదట వృద్ధునిగా కనబడవద్దు. నీవు యౌవన స్థుడవేగాని వృద్ధుడవుకాదు. ఇతరులకు నీవు చాల వృద్ధునిగా కనబడవచ్చు. కాని నాదృష్టిలో నీవింకా యౌవనస్థుడవే'' అని చెప్పినట్లుండెను. కనుక

అవిశ్వాసమును, నిరాశను, మానవ బలహీనతలను చూపించే ఆ కర్రను అబ్రాహాము పారవేసెను. అబ్రాహాము యౌవనస్థునివలె నిటారుగా నడచెను. ''నేను సర్వశక్తిగల దేవుడను. నీలో నాశక్తిని పోయబోవు చున్నాను'' అని దేవుడు చెప్పి నట్లుండెను (2, 6 వచనములు). అబ్రాహాము ఒక కుమారుని కొరకే అడుగుచుండెను. కాని దేవుడు అతనితో ''నీకు అత్యధికముగా సంతానవృద్ధి కలుగజేసి నీలో నుండి జనములు వచ్చునట్లు నియమించుదును. రాజులును నీలోనుండి వచ్చె దరు'' అని చెప్పెను.

ఈ అనుభవములేకుండిన యెడల అతని కొరకు దేవుని హృద యములో ఏమి ఉన్నదో, అబ్రాహాము ఎన్నడును ఎరుగకపోయి యుండును. అదేరీతిగా, మన శ్రమలలో దేవుడు మనకొరకు తన హృదయములో ఏమి కలిగియున్నాడో, ఎంత అధికముగా మన కను గ్రహించగోరుచున్నాడో తెలిసికొనలేము. విశ్వాసము ద్వారానే మన ఆశీర్వాదములను గుర్తించగలము. అపవాది మన విశ్వాసమును బలహీన పరచవలెనని మాటిమాటికి ప్రయత్నించును. దేవుని నమ్ముటకు బదులుగా ప్రతి విషయమునకు మనుష్యులవైపు చూచుచుందుము. అందువలననే ప్రతి స్థలమందును దైవసేవకులు శ్రమపడుట చూచు చున్నాము. దైవ సేవకులు సర్వశక్తిగల దేవుని గురించి వారి బోధలలో చెప్పినను, భిక్షమెత్తుటలో వారెక్కువ సమయము గడుపు చున్నట్లుగా కనుగొందుము. ఉత్తరములద్వారా, ఫోటోలద్వారా, పటములద్వారా వేరే పద్ధతులద్వారా డబ్బు, పాలపిండి, చెప్పులు మొదలగు అనేక వస్తువుల కొరకు బిక్షమడుగుదురు. వారు దేవుని సేవలో భిక్షకులు. కాని, మన

దేవుడు సర్వశక్తిగల దేవుడని మనము ఋజువు చేయవలెను. మనము నమ్మి, ప్రకటించుచున్న సజీవుడైన క్రీస్తు సమస్తము మన కనుగ్రహించ కోరుచున్నాడు. ఫిలిప్పీ 4 : 19లో పౌలు చెప్పుచున్న రీతిగా, ''నాదేవుడు మీ ప్రతి అవసరమును తీర్చును.'' యేసుక్రీస్తు ప్రభువును మన జీవితములలో మహిమపరచుట వలననే విశ్వాసముద్వారా ఆయన పునరుత్థానశక్తిని వెల్లడి చేయుదుము.

పునరుత్థానశక్తిని అబ్రాహాములో దేవుడు బయలుపరచ గోరి, అతనితో నిబంధన చేయుటకు వచ్చెను (11వ వచనము). గలతీ. 1లో నున్న విధముగా, ''సర్వశక్తితో బయలుపరచబడెను''. అబ్రాహామును అతని భార్యయు బహు వృద్ధులుగా నుండినందున అతడు మానవ బలముచే బిడ్డను పొందలేదు. దేవుడు నూతన జీవమును వారిద్దరి శరీరములలో పోసెను, అదియే పునరుత్థానశక్తి, మరణమును జయించు దైవ జీవము. అట్టి శక్తిద్వారానే వారు బిడ్డను పొందగలిగిరి. ఎందుకు అబ్రాహామునకు సున్నతి చేయబడెను? సున్నతి, దేవునిశక్తి మానవుల కందుబాటులో నున్నదను సత్యమునకు గురుతు. విశ్వాసముచే ప్రతి శ్రమకు, శోధనకు, పరీక్షకు అన్వయించు కొనుటద్వారా మనమా శక్తిని పొందుదుము. కొన్నిసార్లు అట్టి విశ్వాసము పొందుట కనేక సంవత్సరములు పట్టును. అరంభములో, జయము కొరకు బైబిలు జ్ఞానముపై ఆధార పడుదుము. ఆ పిమ్మట దీర్ఘప్రార్థనలు, ఉప వాసములు లేక మనోబలము లేక స్వప్నములు, దర్శనములపై ఆధార పడుదుము. ఇవన్నియు అంతరించిపోవును ''ప్రభువా, ఆ రహస్యమును నాకు బయలు పరచుము'', అనియే మన మడుగ వలెను. అప్పుడు మనమెంత బుద్ధిహీను

లమై యుంటిమో తెలిసికొందుము. మనకొరకు మరణించి, జీవించు టకు మనలోనికి వచ్చునట్టి ప్రభువే ఆ శక్తిని మనకనుగ్రహించ గలడు. సమస్తమైన అక్కరలకు ఆయన చాలినవాడు. కనుక ఇట్టి విశ్వాసమును అనుగ్రహించుటకు దేవుడు తన సర్వాధికారము చొప్పున అనేక పద్ధతుల నుపయోగించును.

దేవుని వాగ్దానములలో అతనికుండిన విశ్వాసమును బట్టి, దేవుడు అబ్రాహాము కొక క్రొత్త పేరునిచ్చెను. అతనిపేరును 'అబ్రాము' నుండి 'అబ్రాహాము'నకు మార్చెను; ''నిన్ను అనేక జనములకు జనకునిగా నియమించితి'' (5వచనము). అతడును, అతని భార్యయు సందేహ ముల నుండి, అవిశ్వాసము నుండి విడుదల పొందునంతవరకు దేవునిచే పరీక్షింపబడిరి. ఎంతో ప్రేమతో ఓపికతో వారివురికి బలమైన విశ్వాస మును దేవుడనుగ్రహించెను. మన మెల్లరము ఒకే సమస్యను కలిగి యున్నాము. అనేక పరిస్థితు లలో శత్రువు మన మనస్సులలో సందేహము లను పుట్టించును. కాని దేవుడు ప్రేమతో మనలను గద్దించుచు, సహాయము చేయుచుండును. దేవుడు మన మానవ హద్దుబాటుల నెరిగియున్నాడు (ఆది కాం. 17 : 17). కనుక బలమైన విశ్వాసమ గనుగ్రహించుటకు భయములను, సందేహములను తొలగించుటకును దేవుడు తరచుగా తన వర్తమానికులను మన యొద్దకు పంపించు చుండును. (కీర్తన 103 : 14).

❖❖

# అధ్యాయము - 6

# ఏడవ ప్రత్యక్షత

ఆదికాండము 18 : 1లో దేవుడు అబ్రాహామునకు ఏడవ పర్యాయము మమ్రే దగ్గరనున్న సింధూర వనములో ప్రత్యక్షమయ్యెను. ఆదికాండము 13 : 18 ప్రకారము మమ్రే యనగా 'హెబ్రోను', 'హెబ్రోను' అనగా 'సహవాసమని' యర్థము. ఇప్పుడు దేవునితోనట్టి సహవాసమును అనుభవించు ఆధిక్యతను అబ్రాహాము నేర్చుకొనెను. ఆదికాండము 18 : 1లో గొప్ప ఆశతో తన గుడారపు ద్వారమునొద్ద అబ్రాహాము కూర్చొని యుండుట చూచుచున్నాము. అతడు సంతోషముగా లేడు, కాని ఆశతో నుండెను. అతడు దేని కొరకో ఎదురుచూచు చుండెను. నీవు ఆత్మీయంగా ఎదుగుకొలది జరుగనైయున్న సంగతుల విషయమై నీవు హెచ్చరింపబడవచ్చును. జాగరూకుడవై యుండుమని హృదయములో ఏదో నిన్ను హెచ్చరించును. ఈ రీతిగా ముందుగానే మనము సిద్ధపరచబడుదుము. ఆది కాం. 18 : 2లో దేవుడు అబ్రాహామునకు సామాన్య మనుష్యుడుగా ప్రత్యక్షమయ్యెను. కాని ఆది కాం. 19:1లో దేవుడు లోతునకు దేవదూతరూపంలో ప్రత్యక్షమయ్యెను. ఆది కాం. 17 : 8లో ముగ్గురు మనుష్యులు అబ్రాహాముతో మాట్లాడు చుండిరి. వారు ముగ్గురు చేరి అతనికొక ప్రశ్నవేసిరి. కాని 10, 13 వచనములలో దేవుడు ఒంటరిగా అబ్రాహాముతో మాట్లాడుచుండెను. దేవదూతవలె మూరు రూపంలో వచ్చినను, దేవుడు ఒంటరిగా అబ్రాహాముతో మాట్లాడుట కారంభించినప్పుడు, తాను దేవునితో మాట్లాడు

చున్నానని అబ్రాహాము గుర్తించ గలిగెను లోతు సందర్భంలో, ఇద్దరు దేవదూతలు మాత్రమే అతని యొద్దకు వెళ్ళిరి. సామాన్య మనుష్యులవలె వచ్చినను, గొప్ప ఆనందముతో అబ్రాహాము వారి నాహ్వానించెను. లోతు సందర్భములో వారు దేవదూతల వలె అతనికి కనబడినను అర్థ హృదయ ముతో ఎట్టి ఆహ్వానమిచ్చెనో చూడుము.

18 మరియు 19వ అధ్యాయములలో వీరివురిచే నియ్యబడిన ఆహ్వానమును పోల్చిచూడుము. వారిని కలిసి కొనుటకు అబ్రాహాము పరుగెత్తెను. వారిని చేర్చుకొనుటలో అతడెంత ఆనందము పొందెనో అది చూపించుచున్నది. సామాన్య మనుష్యులవలె అబ్రాహామునకు కనబడినను, వారిని కలసి కొనుటకు ఆనందంతో ముందుకు వెళ్ళెను. ఈ మనుష్యులు దేవదూతలని లోతు ఎరిగి యుండినను, వారి నాహ్వా నించుటకు తానున్న చోటునే నిలిచియుండెను. ఆది. కాం. 18 : 3-5లో అబ్రాహాము ''రండి, కూర్చొనండి. నేను లోపలికి పోయి, మీ ముగ్గురికొరకు ఆహారము సిద్ధపరచెదను'' అని పలికెను. కాని లోతు, కాళ్ళు కడుగుకొనుటకు నీళ్ళిచ్చినను, ఆహారమును గురించి వారితో ప్రస్తావించలేదు. అతడు దేవదూతలతో నిట్లనెను, ''మీరిటనుండి ఉదయమున వెళ్ళిపొండి'' (ఆది. కాం. 19:2). తన భార్యవారిని చేర్చుకొన నిరాకరించునేమోయని లేక ఆహార మియ్య నిరాకరించు నేమోయని అతడు భయపడి యుండ వచ్చును. అది. కాం. 18 : 7లో అబ్రాహాము ఎంత గొప్ప ఆనందముతో పశువుల మందకు పరుగెత్తిపోయి ఒక లేత దూడను తెచ్చెనో చూడుము. మూడు మానికల మెత్తని పిండిని తీసుకొనుమని తనభార్యతో చెప్పెను. ఒక మానిక పిండి ముగ్గురు

మనుష్యులకు సరిపోవును. కాని వారు దాదాపు ముప్పది మందికి సరిపోవు ఆహారమును సిద్ధపరచిరి. అతని అతిథులు ముగ్గురైనను అతని యానంద మెంతో గొప్పదిగానుండుటచే, తన సమస్త కుటుంబం సహవాసములో చేరవలెనని కోరెను. అతడు సిద్ధరపచగలిగినది సమృద్ధిగా చేసెను. మరియు వారు గొప్ప ఆనందముతో ఆతనియొద్ద గడిపిరి.

లోతు సందర్భములో, దేవదూత, 'నడివీధిలో రాత్రి వెళ్ళబుచ్చె దము' అని పలికెను (ఆది కాం. 19 : 2). అర్థ హృదయముతో లోతు ఇచ్చిన ఆహ్వానముబట్టి, వారు నడివీధిలోనే రాత్రంతయు గడుపగోరిరి. లోతుయొక్క భార్యబిడ్డలు అతనితో ఏకమనస్కులు కారని ఎరిగి యుండినందున, వారు లోనికి వెళ్ళుటకు ఇష్టపడలేదు. వారిని లోపలికి తీసికొని వెళ్ళుటకు లోతు వారిని బలవంతము చేయవలసి వచ్చెను. మనము కొన్ని గృహములకు వెళ్ళునప్పుడు, ప్రభువు అక్కడ వున్నట్లు గుర్తించుదుము. అట్టి వారితో నుండువలన మనకు గొప్ప ఆనందము కలుగును. కాని వేరే కొన్ని గృహములకు వెళ్లినప్పుడు, కొన్ని క్షణములైనను అక్కడ నుండుటకు ఇష్టపడము. అట్టి గృహము లలో నెమ్మదిగా ఈ రీతిగా చెప్పుచున్నట్లుండును, ''వెళ్ళిపొండి, వెళ్ళి పొండి''. యథార్థ ముగా చెప్పవలయుననినచో కొన్ని క్షణములే అచ్చట గడపవలసి వచ్చి నను, బలవంతమున గడప వలసినదే.

నీ గృహము ఎటువంటి గృహము ? వస్తు సామాగ్రి లేక ధనము లేక ఆహారము నీ గృహమును సంతోషముగల గృహముగా చేయలేవు. దేవుని సన్నిధి మాత్రమే సంతోషముగల గృహముగా చేయగలదు. అబ్రాహాము, శారా మరియు కుటుంబమంతా కలిసి అతిథులను చేర్చు

కొనిరి. వారితో నుండుటకు అతిథులుకూడ చాలా సంతోషించిరి. కాని లోతు విషయములో మిక్కిలి బలవంతము చేసిన తరువాతనే వారు లోతు ఇంటిలోనికి వెళ్లిరి (ఆది.కాం 19 : 3). ''మార్గములో ఆహారమేదైనా తీసికొనినారా ? అని లోతు అడిగి యుండవచ్చును. కొందరు అలవాటుగా ఇట్టి ప్రశ్న వేయుదురు, కాని సత్కరించవలయు ననెడి కోరికతోకాదు. అనేక సంవత్సరముల క్రితం మా సహోదరిని చూడ వెళ్లితిని. ''తినుటకేమైనా తీసుకొంటారా?'' అని ఆమె నన్నడిగెను. ''తీసుకుంటాను'' అని సమాధాన మిచ్చితిని. అప్పుడామె ''మీరెంతో అలసిపోయినట్లు కనబడుచుండుటచే నిరాకరిస్తారని తలంచితిని. మా ఇంట్లో ఏమీలేదు'' అని పలికెను. లోతు కూడ అట్లే చేసి యుండవచ్చును లోతు భార్యను గూర్చిన ప్రస్తావనలేదు. అతిథుల కొరకు ఆహారము సిద్ధము చేయుమని లోతు తన భార్యను కోరి యుండిన యెడల, ఆమె పెడసరముగా నిట్లు బదులిచ్చి యుండ వచ్చును. ''నీవే సిద్ధము చేయుము వారు నా అతిథులు కాదు, నీ అతిథులు'' లోతు తనంతట తానే ''పొంగని రొట్టెలు కాల్చగా, వారు భోజనము చేసిరి''. అని చదువుచున్నాము (ఆది కాండము 19:3).

సొదొమ సమీపములో నివసించుటకు లోతు కోరుకొనెను. ఆరంభములో సొదొమకు వెలుపలనే జీవించి యుండవచ్చును కాని, అ పిమ్మట లోనికి వెళ్ళెను. అప్పుడతడు సొదొమలో నొక పెద్ద యాయెను మరియు దానిఫలితము అతని స్వంతవారు లోకభోగములతో నిండినవారైరి. ఈ లోకము యొక్క ఘనత, ధనము, సొగసులచే నాకర్షింపబడి విశ్వాసులనేకులు ఆనందము సంతోషమును కోల్పోవు

దురు. ఆ అతిథులు దేవుని వర్తమానికులని తలంచి అబ్రాహాము వారి చేర్చుకొనెను, మొదట అన్యులనుగా అతడు వారిని చేర్చుకొనెను. బహుశ హెబ్రీ 13 : 2. అబ్రాహామునకు వర్తించునేమో. అతడు వారితో సంభాషించుట నారంభించినప్పుడు వారెవరో తెలిసికొనగలిగెను. మనము కూడ అట్లే యుండవలయును అన్యులను సహితము గొప్ప ఆనందముతో ఆయన నామములో చేర్చుకొను స్వభావమును మనము కూడ కలిగి యుండవలెను.

దేవుడు అబ్రాహాము యొక్క విశ్వాసమును బలపరుచుట కతనికి ప్రత్యక్షమయ్యెను, ''నీభార్యయైన శారా కుమారుని కనును.'' అని దేవుడు చెప్పెను. శారా తనలో తాను నవ్వుకొనుచు యిట్లనుకొనెను. ''నేను వృద్ధురాలనైన తరువాత నాకు సుఖము కలుగునా, నా ప్రభువు కూడ వృద్ధుడేగదా?'' ''శారా ఎందుకు నవ్వెను''. అని దేవుడు ప్రశ్నించెను. సందేహమును కలిగించుటకు అపవాది ఎట్లు ప్రయత్నించెనో చూడుము ! అది అపవాది పని. వారి మనస్సులలో సందేహము కలుగునని దేవుడు ముందుగానే ఎరిగి యుండెను. కనుక, వారి సందేహములు తొలగించుటకు ఆయన ప్రేమతో వచ్చెను. ఆయన ప్రజలు నిరుత్సాహముతో నిండియున్నప్పుడు వారిని ప్రోత్సాహ పరచి బలపరచుటకు తరచుగా తన వర్తమానికులను దేవుడు నిశ్చయముగా పంపుచుండును. ఇది ఉత్తరముల ద్వారానె లేక వర్తమానికుల ద్వారానో సంభవింపవచ్చును.

ఆదికాండము 18:16 అబ్రాహాము ఆ మనుష్యులతో నడిచెను. హానోకు దేవునితో నడిచినట్లు అతడు వారితో నడిచెను. వారితో

సహవాసము కలిగియుండుటకేగాని, వారి నుండి ఏద్దైనా లాభము పొందుటకు గాదు. అప్పుడు వారిలో ఇరువురు మనుష్యులు సొదొమవైపు సాగిపోయిరి. దేవుడు వ్యక్తిగతముగా అబ్రాహాముతో మాట్లాడవలయు నని వెనుకనే ఆగిపోయెను. ఆయన నిట్లను కొనెను ''అబ్రాహాము నా స్నేహితుడు. నేనతని నెరుగుదును మరియు అతని నుండి ఏరహస్యమును దాచలేను. నేనతనిని గమనించితిని. తన కుటుంబము విషయమై ఎట్లు జాగ్రత్త వహించునో నేనెరుగుదును. నాహృదయ రహస్యమును యిప్పుడు అతనితో చెప్పబోవుచున్నారు. సొదొమ,గొమొఱ్ఱా మనుష్యులకు తీర్పు తీర్చబడినా సమయము వచ్చినది.'' దేవదూతలు సొదొమ గొమొఱ్ఱాలకు సాగిపోగా, అబ్రాహాము దేవుని ఎదుట నిలిచి యుండెను. మరియు దేవుడైన యెహోవా ఒంటరిగా అబ్రాహాముతో మాట్లాడెను. అబ్రాహాము యొక్క స్నేహితుడుగా ఆయన ధారాళముగా మాట్లాడెను. అబ్రాహాముతో మాట్లాడుటకు ఆయన తన దూతలను పంపలేదు : కాని వ్యక్తిగతముగా అతనితో మాట్లాడుటకు వచ్చెను. కొందరు మనతో మాట్లాడ కోరినప్పుడు తమ సేవకులను పంపెదరు. ''ఫలాని వారి యొద్దకు వెళ్లి, ఈ వర్తమానమిమ్ము'' అని వారితో చెప్పి పంపెదరు: ''నాయంతట నేనే అబ్రాహాముతో మాట్లాడెదను. అతనితో మాట్లాడు టకు నాకొక ముఖ్యమైన సంగతి గలదు'' అని ఇక్కడ దేవుడు పలుకు చుండెను. కనుక తన దూతలను సొదొమ, గొమొఱ్ఱాలకు పంపించి వేసెను.

ఎంతటి ఆధిక్యత మనకున్నది! ఆయన స్నేహితులముగా నుండుటకు ఎంత గొప్ప ఘనత: ఊహించుము, ప్రభువు తనంత తానే

మనతో మాట్లాడుటకు వచ్చును. ఇట్టి ఆధిక్యతకు యోగ్యులమగుటకు, మొదట మనము పరీక్షించబడి అంగీకరింప బడవలెను. ఆదికాండము 18:19లో, తన తరువాత తన పిల్లలును, తన యింటివారును నీతిన్యాయములు జరిగించుచు, యెహోవా మార్గమును గైకొనుటకు అతడు వారికి ఆజ్ఞాపించు నట్లు నేనతనిని ఎరిగి యున్నాను'' అని దేవుడు పలికెను. కనుక అతడు నమ్మకముగా తన కుటుంబమంతటికి దేవుని వర్తమాన మందించుచుండుటను దేవుడు గమనించుచుండెను. ప్రతి కుటుంబమును క్రమముగా అనుదినము కుటుంబ ప్రార్థన కలిగియుండవలెను. మన పిల్లలకు క్రమముగా, నమ్మకముగా దేవుని వాక్యమును బోధించిన యెడల మనముకూడ దేవుని స్నేహితులము కాగలము మరియు దేవదూతలకు మరుగుచేయ బడినవి మనకు బయలుపరచబడును. సంభవింపనై యున్న సంగతులను గూర్చి దేవుడు అబ్రాహాముతో చెప్పినప్పుడు, అబ్రాహాము సొదొమ గొమొఱ్ఱాలలోని మనుష్యులకొరకు విజ్ఞాపన చేసెను. దేవుని స్నేహితునిగా అతడు ధైర్యమును సమ కూర్చెకొనెను. మనము కూడ ఇతరుల నిమిత్తము విజ్ఞాపన చేయుటకు ధైర్యమును, స్వాతంత్ర్యమును కలిగియుండగలము. మరియు చీకటిలో నున్న వారి కొరకు కృపాకనికరములను అడుగలము (వ 32). ఆరీతిగా దేవుని జత పనివారము కాగలము.

దేవుడు లోతునొద్దకు వెళ్ళలేదు. కాని లోతు నిమిత్తము అతని భార్యాపిల్లల నిమిత్తము అబ్రాహాము విజ్ఞాపన చేసినందున వారిని హెచ్చరించుటకు తన దూతలను పంపెను. లోతు సొదొమ గొమొఱ్ఱా సమీపములో నివసించుటకు కోరుకొని ఆయనను దుఃఖపరిచినందున

తన రహస్యమును లోతుతో పంచుకొనవలెను ఆశ దేవునికి లేకుండెను. ఆసమీపములో నున్న సారవంతమైన భూమిచే అతడు మోసగింపబడెను. కడపటికి సొదొమలో నొక పెద్దగా అతడు చేయబడెను. లోతును పోలి మనలో ఎవరైనా లోక భోగములను ఘనతను కోరుకొనిన యెడల ప్రభువు మన యొద్దకు రాడు. తన రహస్యములను మనకు బయలుపరచడు. తిరిగి జన్మించిన విశ్వాసులనేకులను నేనెరుగుదును. 'దేవుని సంఘము' అనగానేమో వారెరుగరు. కాని ఎక్కడనో పెద్దలుగా నుండవలెనని కోరుదురు. మరియు దేవుని ప్రజల యొక్క సహవాసమును తృణీకరించుదురు. పెద్దలుగా గౌరవించగోరుదురు. మరియు నామకార్థ క్రైస్తవులు వారి నాహ్వానించుటకు సిద్ధముగా నందురు. 'అగ్ని' నుండి వారు తప్పించబడుదురు. కాని వారు చేసినదంతము 'కొయ్యకాలు, కర్రగడ్డి' వలె నుండి కాల్చివేయబడును. దేవుని వాగ్దానము కంటే ఈ లోక సంగతులు మనకు ఎక్కువగా నుండుకుండు నట్లు హెచ్చరిక పొందుదము.

❖❖

## అధ్యాయము - 7

# విధేయత - ఆశీర్వాద రహస్యము

ఇస్మాయేలు, ఇస్సాకును పరిహాసించుట శారా చూచి నప్పుడు అబ్రాహాముతో నిట్లనెను. ''ఈ దాసిని దీని కుమారుని వెళ్ళగొట్టుము : ఈ దాసి కుమారుడు నాకుమారుడైన ఇస్సాకుతో వారసుడై యుండును.'' ఇది అబ్రాహామునకు దుఃఖము కలిగించెను. ఇస్మాయేలు యెడల అతడు కలిగియున్న సహజ మక్కువనుబట్టి, ఈ మాటలు అబ్రాహామును గాయపరచి, బాధ కలిగించెను అప్పుడు దేవుడు ఎనిమిదవ పర్యాయము అతనికి ప్రత్యక్షమయ్యెను. నిజముగా ఆసమయములో శారా పరిశుద్ధాత్మ ద్వారా నడిపింపబడెను. అబ్రాహాము ఇస్మాయేలు యెడల తన కున్న ప్రేమ మక్కువల ద్వారా నడిపింపబడెను. గలతీ. 5:22-31లో ఇది దృఢపరచబడెను. శారా పరిశుద్ధాత్మచే నడిపింపబడెను. మిక్కిలి కఠినమైన నొక అనుభవమును పొందిన పిమ్మట, ఆమె ఈ పాఠము నేర్చుకొనెను. వారు కల్దీయుల ఊరు నుండి వెలుపలికి వచ్చిన పది సంవత్సరముల తరువాత, ఆమె స్వయముగా హాగరును అబ్రాహామున కిచ్చెను. (ఆది కాం. 16:1-11). దేవుని వాగ్దానము యొక్క నెరవేర్పున కామె పది సంవత్సరములు వేచి యుండెను, కాని ఏమి జరుగకుండుట చూచి, తన దాసురాలిని అబ్రాహామున కిచ్చెను. తదుపరి ఆమె హాగరుచే తృణీకరింపబడెనని చదువుచున్నాము. ఆమె పొరబడి కుమారుని పొందుటకు దేవుని సమయము నిమిత్తము వేచి యుండుటకు బదులు తన ప్రాచీన స్వభావముచే నడిపింపబడెను.

ఆదికాండము 21:10లో అబ్రాహాము మానవ మక్కువచే నడిపింపబడుట చూచుచున్నాము. స్వయముగా కఠిన పాఠమును

నేర్చుకొనిన శారా ఇట్లనెను. ''ఈ దాసిని దీని కుమారుని వెళ్ళ గొట్టుము'' క్రైస్తవులుగా పిలువబడు వారందరు తేజోవాసులైన పరిశుద్ధుల స్వాస్థ్యములో పాలుపొందలేరు నామకార్థ క్రైస్తవులు, బాహ్యముగా ఎంత మంచి వారైనను అందులో పాలుపొందనేరరు. స్వాభావికముగా మంచి వారైన నామకార్థ క్రైస్తవులనేకులు గలరు. వారెంతో ప్రేమగలవారు, చాలామంచివారు. వారు బహుగా త్యాగముచేసి ప్రభువు పనిలో అధిక ముగా ధనమును వినియోగించెదరు. కాని విచారకరమైన సంగతేమనగా వారు తిరిగి జన్మించలేదు. రక్షణ నిమిత్తము తమ స్వనీతిపై నాధార పడుదురు.

దైవజనుడొకడు సువార్త దండయాత్ర నిమిత్తము ఒక స్థలములో నుండెను. ఒక మంచి క్రైస్తవ కుటుంబముతో ఆయన నివసించు చుండెను. అతడా స్థలమును వదలిపోవు సమయమున ఇట్లు ప్రార్థించెను. ప్రభువా ఈ గృహస్థుని నిమిత్తమును గృహిణి నిమిత్తమును నాకొక వర్తమానమిమ్ము. వారు నాపట్ల ఎంతో మంచిగానుండిరి. గనుక దయచేసి చాలమంచి వర్తమానమను గ్రహించుము.'' ''ఒకటి నీకు కొదువగా నున్నది'' యనెడి వర్తమానమును దేవుడు అతనికిచ్చెను. ఆదైవజనే డిట్లనెను ''ప్రభువా, వీరు నాపట్ల ఎంతో మంచిగానుండిరి. ఇట్టి వర్తమానము వారి ఎట్లు ఇవ్వగలను?'' ఆయన యెంతగా ప్రార్థించెనో అంతగా ''ఒకటి నీకు కొదువుగా నున్నది'' (లూకా 18:11). అను అదే వర్తమానము మరల మరల తనకివ్వబడెను. ఈ సందేశమును నేరుగా ఆగృహస్థునికి, గృహిణికి చెప్పుటకతనికి ధైర్యము చాలకపోయెను. కనుక అతడు దానిని ఒక కాగితముపై వ్రాసి, కిటికి తెరకు గ్రుచ్చెను ఆపిమ్మట అతడు మెట్లుదిగి వచ్చి గృహస్థునికి, గృహిణికి వందనములు చెప్పి

వెళ్లిపోయెను. అతడు వెళ్లిపోయిన పిదప ఆ ఇల్లాలు మేడపైకి వెళ్లి కిటికీ తెరకు గ్రుచ్చబడిన కాగితమును చూచెను. ''ఒకటి నీకు కొదువగా నున్నది'' అను మాటలను ఆమె చదివి, తన భర్తను పిలిచి ''మనకు దైవజనుని చివరి మాటలివి'' అని ఆశ్చర్యముతో చెప్పెను. వెంటనే వారిరువురు కిటికీ ప్రక్కన మోకాళ్ళూని, ''ఓ దేవా, మా నిమిత్తము దైవజనుడు విడిచిపోయిన ఈ మాటల భావమును తెలియజేయుము,'' అని ప్రార్థించిరి. వారు అట్లు ప్రార్థించగా, ఆ దినమువరకు వారు తిరిగి జన్మించక నీతి మంతులగుటకు తమ సత్కార్యములపై ఎట్లు ఆధారపడు చుండిరో దేవుడు వారి చూపించెను. వారి అనుభవములో యేసుక్రీస్తు ప్రభువును తమ రక్షకునిగా చేర్చుకొనలేదు. బాహ్యమున వారు సత్కార్య పూర్ణులైన చాలా మంచి క్రైస్తవులు. అన్ని కూటములకు హాజరగు చుండిరి. దేవునిపని నిమిత్తము క్రమముగా ద్రవ్యము నిచ్చుచుండిరి. కాని వారు తిరిగి జన్మించలేదు. మీ జ్ఞానము లేక మీజాలి మిమ్మును మోసము చేయనియ్యకుము. ఇష్మాయేలు యెడల అబ్రాహాము గొప్ప ప్రేమను కలిగియుండినను, దేవుని రాజ్యములో ఇష్మాయేలునకు పాలులేదు. అతడు శరీర మూలముగా జన్మించెను. కాని ఇస్సాకు ఆత్మ మూలముగా జన్మించెను. ఇస్సాకు జన్మించక ముందు అబ్రాహాము యొక్క శరీరములో దేవుడు నూతన జీవమును పోసెను.

పరిశుద్ధ గ్రంథము ( బైబిలు) లో పునరుత్థానశక్తికి ఇస్సాకు ఒక మాదిరిగానున్నాడు. పునరుత్థాన శక్తిని అనుభవము ద్వారా పొందని యెడల, దేవుని రాజ్యములో మనకు పాలు ఉండనే వుండదు. నీవు ఏ గుంపుకు చెందినవాడవో నిశ్చయము చేసి కొనుము; ఇష్మాయేలు గుంపుకా? లేక ఇస్సాకు గుంపుకా? ఇష్మాయేలు యెడల అతడు కలిగి యుండిన మానవ వాత్సల్యముచే నడిపించబడుచుండుట వలన,

అబ్రాహాము ఆసమయమునందు గొప్ప ఆత్మీయ అపాయములో నుండెను. కనుక దేవుడు అతనికి ప్రత్యక్షమై, అతని భార్య చెప్పినది చాలా ముఖ్యమైనదనియు ఆమె చెప్పినదెల్ల వినుమనియు అతనితో చెప్పెను. జరిగిపోయిన కాలములో దేవుని చిత్తమును చేసితిమి. కనుక భవిష్యత్తులో కూడనట్లే చేయుచుండెదమనుటకు అది నిదర్శనము కాదు. ఏ సమయమందైనా పొరపాటు చేయుట సాధ్యమే. వయస్సులో పెద్దవారమగు కొలది, బంధువుల యెడల, స్నేహితులయెడల మనకున్న మమత కూడ బలీయమగు చుండెను. అనేకులు వృధాప్యములో ఇతరుల యెడల వారికున్న అప్యాయతను బట్టి దేవుని విషయములో తప్పిపోవు చుందురు. ఎవరి యెడలనో ఉన్న ప్రేమనుబట్టి తల్లిదండ్రులు, భార్యలు, భర్తలు, పిల్లలనేకులు దేవునికి అవిధేయులగుచుందురు. ఈ మానవ ఆప్యాయత దేవుని అప్యాయత యొక్క ఆధీనములోనికి తేబడవలెను. అట్లు ఆధీనములోనికి తేబడుట మిక్కిలి బాధకరమైనను, అది చాల క్షేమకరమైనది. అబ్రాహాము కుమారుని తన యొద్దనుండి పంపివేయ వలసి వచ్చెను. అతడు లోబడక పోయిన యెడల దేవుడు అతనికి ప్రత్యక్షము కాకపోవును. అది అబ్రాహామునకు దుఃఖకరముగా నుండినను, అతడు దేవునికి విధేయుడాయెను. కొన్ని పర్యాయములు, దేవుని వాక్యమునకు, దేవుని ఆజ్ఞకును లోబడుట మిక్కిలి బాధకరముగా నుండును. కాని అబ్రాహాము దేవుని గద్దింపును అంగీకరించెను. ఎన్నడును శరీరము ద్వారాగాక, అన్ని సమయములలో ఆత్మద్వారా నడిపింపబడుటెట్లో మనకు చూపించనుద్దేశించి 21వ అధ్యాయములలో దేవుడు అబ్రాహామునకు ప్రత్యక్షమాయెను. నీవు దేవుని స్నేహితుడవుగా నుండ గోరిన యెడల, దేవునికి లోబడుము. తండ్రినిగాని, తల్లినిగాని సోదరునిగాని,

స్నేహితుని గాని లేక భార్యను గాని ఎన్నడును మార్గములో నీకు ఆటంక ముగా రానియ్యకుము. ఎంతో యుక్తితో నీ ప్రియులను శత్రువు నీయెదుటకు తెచ్చును. మరియు కొన్ని సార్లు దేవుని చిత్తమును చేయకుండ నిన్ను ఆటంక పరచుటకు భార్యయో లేక బిడ్డయో ఏడ్చును ఆరంభించునట్లుగా చేయును.

అపొస్తలుడైన పౌలు ప్రభువాజ్ఞను పొంది యెరుషలేమునకు పోవు మార్గములో కైసరయనొద్ద కొంత కాలమాగెను. ఆగబు ప్రవక్త అచ్చటికి వచ్చి, పౌలు నడికట్టును తీసికొని, తన చేతులను కాళ్ళను కట్టుకొని, ''యెరుషలేములోని యూదులు ఈ నడికట్టుగల మనుష్యుని ఈలాగు బంధించి, అన్యజనుల చేతి కప్పగింతురని పరిశుద్ధాత్మ చెప్పుచున్నాడు'' అనెను. పౌలు స్నేహితులు ఈ మాటలు విని ఏడ్వనారంభించిరి. వారు మంచివారే కాని పౌలు ఎట్లు బంధింపబడనైయున్నాడో వారు వినినప్పుడు ఏడ్చుచు 'అక్కడకు వెళ్ళవద్దు అక్కడకు వెళ్ళవద్దు' అని చెప్పుటకు ఆరంభించిరి. కాని పౌలు 'ఇదెందుకు? మీరు ఏడ్చి నాగుండె బద్దలు చేసెదరేల? నేనైతే ప్రభువైన యేసు నామము నిమిత్తము యెరుషలేములో బంధింపబడుటకు మాత్రమేగాక చనిపోవుటకు సిద్ధముగానున్నాను.'' అని బదులు చెప్పెను. (అపొ.కార్య. 21:3). పౌలు దేవుని ఆజ్ఞను స్పష్టముగా విని యుండెను. మరియు దేవుని చిత్తము విషయమై నిశ్చయత కలిగియుండెను. కనుక అతని స్నేహితులు కన్నీటిలో బ్రతిమిలాడినను, వెళ్ళకుండ నాపుటకు ప్రయత్నించినను, అతడు ధృడముగా నిలిచి యుండెను. మనలో చాలా మందిమి అంతటి బలవంతులము కాము. ఇతరుల కన్నీరు దేవుని చిత్తమును చేయకుండ మనల నాటంక పరచ నిచ్చెదము.

నీవు దేవునికి లోబడ గోరుచున్నావని నీప్రియులు విని ఏడ్వనా రంభించిన సందర్భములలో నీవు దేవునికి అవిధేయుడవు కాలేదా? సత్యము చెప్పుము. ఇందువలననే అనేకులు దేవుని సేవ కొరకైన పిలుపునకు విధేయులు కాలేరు. అదేరీతిగా, వేరొక స్థలమునకు వెళ్ళుమని దేవుడు కోరినప్పుడు అనేకులు వెళ్ళనిరాకరించిరి. కొందరు బాప్తిస్మము పొంద నిరాకరించిరి. వారి నుండి దేవుడు కోరిన దానిని కొందరు ఆయనకు ఇయ్యలేదు. దేవుని వాక్యమిట్లు సెలవిచ్చుచున్నది. 'తండ్రినైనను, భర్తనైనను భార్యనైనను నాకంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు' (మత్తయి 10:36).

ఆ పరీక్షలో ఉత్తీర్ణుడైనందున మరియొక పరీక్షద్వారా అబ్రాహాము పోగలిగెను. హాగరు, ఇష్మాయేలు సందర్భములో అతడు పొరపాటు చేయబోయెను. కాని దేవుడు మాట్లాడగా అతడు లోబడెను. ఆ పిదప 22వ అధ్యాయములో చాలా తీవ్రమైన పరీక్ష వచ్చెను. ఆదికాండము 22లోని సంభవముల సంవత్సరములోనే దేవుడు తొమ్మిదవమారు అబ్రాహామునకు ప్రత్యక్షమాయెను. 21వ అధ్యాయములో ఇష్మాయేలు పట్ల అతనికున్న ఆప్యాయత ద్వారా అబ్రాహాము నడిపించబడినట్లు, ఇస్సాకు సందర్భములో అట్లే నడిపించబడు శోధన శారా కలిగియుండెను. కనుక ఇస్సాకుయెడల దేవుని కోరికను గూర్చి శారాతో అబ్రాహాము యేమియు చెప్పలేదు. ఏమేమి తలంచుచుందురో ఏమేమి తినుచుందురో, ప్రతి విషయమును తమ భార్యలతో తప్పక చెప్ప వలయునని కొందరు భర్తలు తలంచుచుందురు. ''ఎక్కడకు వెళ్లితివో చెప్పుము? ఆ పెద్ద పలికినదేమి?'' ఇట్లు భార్యలు కూడా తమ భర్తలను తొందర చేయుచుందురు. బలహీన మనస్సుగల భర్తలు ప్రతి విషయమును తమ భార్యలతో చెప్పు చుందురు. మరియు భార్యలు ప్రతిచోట దానిని

చాటించుచుందురు. ఈ రీతిగా దైవ సేవకుల భార్యలు తమభర్తల యొక్క పరిచర్యను చెప్పుచుందురు. ఇట్లు తమ భార్యలతో ప్రతి విషయ మును చెప్పుటద్వారా ఎక్కువ ప్రేమను వారికి చూపుచున్నా మని భర్తలు తలంచుచుందురు. కొన్ని సంగతులు తన భార్యయైన శారాకు చెప్పుటలో గల అపాయమును అనుభవము ద్వారా అబ్రాహాము ఎరిగి యుండెను. ఇస్సాకును బలి ఇయ్యమని దేవుడు తనను అడిగినట్లు శారాతో చెప్పిన యెడల వెంటనే ఆమె ఏడ్చుట కారంభించి, 'ఓ నాకుమారుడా! ఇస్సాకా! నా ఒక్కగానొక్క కుమారుడు, నిశ్చయముగా దేవుడు ఇట్టి దానిని మన నుండి అడుగడు;' అని చెప్పునని అత డెరిగి యుండెను. కనుక పరి శుద్ధాత్మ ద్వారా నడిపించబడి, ఆసంగతిని గూర్చి శారాతో ఏమియు చెప్పకనే అబ్రాహాము ఇస్సాకును తీసికొనిపోయెను. భర్తలారా హెచ్చరిక పొందుడి. ప్రతి విషయమును నీభార్యతో చెప్పవద్దు భార్యలు గంటల కొలది ఏడ్వవచ్చును: మీకును దేవునికిని మధ్య మాత్రమే గల సంగతు లలో మీ భార్యలమాట వినవద్దు. దేవుని చిత్తమునకు ప్రథమస్థానమియ్య నేర్చుకొనుడి.

22వ అధ్యాయములోని పొట్టేలు దేవుని ద్వారానే అచ్చటికి తీసి కొనిరాబడెను. ఆపొట్టేలు పారిపోవునేమోయను భయములేదు. దేవుడే దానిని అక్కడకు తెచ్చెను. దాని కొమ్ములు పొదలో తగులుకొని ఉన్నట్లు అబ్రాహాము చూచెను. పొట్టేలును బలి ఇయ్యమని అబ్రాహామును దేవుడెందుకు కోరెను? ఒక ఉద్దేశము నిమిత్తము పొట్టేలు పొదలో చిక్కుకొని ఉండెను. దేవుడు అబ్రాహాముతో నీవిధముగా చెప్పినట్లుం డెను. ''అబ్రాహామా, నామాటకు సంపూర్ణముగా లోబడితివి. ఏప్రశ్న వెనుకంజ లేకుండ నీ కుమారుని బలిపీఠముపై వుంచితివి. కనుక పొదలో పట్టుపడిన పొట్టేలువలె నేను నీకు పట్టుబడితిని, మరియు నీకు

కట్టుబడితిని. ఇప్పుడు నీవు నాకాజ్ఞాపించుము, నేను లోబడెదను,'' ఎట్టి మర్మము: దేవుడు అబ్రాహామునకు కట్టుబడి యుండెను. దేవునికి లోబడుట ఎట్టి అధికృతయో నీవు గుర్తించ లేదు. అట్లు చేయుట నీ హక్కు. మనము హృదయపూర్వకముగా దేవునికి లోబడుకొలది, మనమాయనకు ఆజ్ఞాపించగలము - ''నాకాజ్ఞాపించుము'' అని యెషయా 45:11లో ఆయన సెలవిచ్చెను. అప్పుడాయన నీమాట వినును.

ఆఖరిగా పదవ పర్యాయము దేవుడు అబ్రాహామునకు ప్రత్యక్షమాయెను. ఈసారి దేవుడు అబ్రాహామున కొసగిన ఆశీర్వాదమును చూడుము. 'నీవు నామాటవిని నాకు లోబడితివి గనుక, నేను నీకు కట్టుబడితిని. మరియు నీవు నాకాజ్ఞాపించ వచ్చును. నేను నిన్ను సేవించెదను.' అది పరలోక మర్మము; మనము దేవునికి సంపూర్ణముగా లోబడు కొలది దేవుని రాజ్యమంతటికి యోగ్యులమగుదము (ఆది కాం. 22:17 చివరి భాగము); 'నీసంతతివారు తమ శత్రువుల గవిని స్వాధీన పరచుకొందురు.' రాజ్యమంతటిని మనకొసగుటయే దేవుని ఉద్దేశము - మన శత్రువులపైన జయము మరియు ఆయన కార్యముల పైన అధికారము. 'చిన్నమందా భయపడకుము, మీకు రాజ్యమిచ్చుటకు తండ్రి కిష్టమాయెను.' స్వల్ప విషయములలో కూడ సంపూర్ణముగా ఆయనకు లోబడుము. ఆయన యొక్క సంపూర్ణ అధికారము క్రిందికి రమ్ము. అప్పుడు ఆయన రాజ్యము నీ రాజ్యమగును; ఆయన మహిమ నీ మహిమయగును, మరియు ఆయనకున్న సమస్తము నీదగును.

❖❖

## అధ్యాయము - 8

# వధువు నేర్పరచుకొనుట

తమ కుమారుల కొరకు, కుమార్తెలకొరకు జీవిత పాలి భాగస్తులను వెదకుచున్న తల్లిదండ్రులకొక హెచ్చరికయు. వాల సహాయకరమైన సూచనయు కలిగిన సంఘటన ఒకటి అబ్రాహాం జీవితములో కలదు. వివాహసమస్య వచ్చినప్పుడు అనేక మంది తల్లిదండ్రులు, యౌవనస్థులు మిక్కిలి విచారకరమైన పొరపాట్లు చేయుదురు. అందువలనే సంతోషములేని గృహముల నెదుర్కొను చున్నాము. వారు చేసిన పొరపాటును బట్టి జీవితకాలమంతయు పశ్చాత్తాపపడవలసి యుండును.

తన కుమారుని కొరకు భార్యను వెదకు బాధ్యతను తన సేవకునికి అప్పగించినప్పుడు అబ్రాహాము ఒక తీవ్రమైన హెచ్చరిక చేసెను ( ఆది. కాం. 24:3) ''నేను ఎవరిమధ్య కాపురమున్నానో ఆ కనానీయుల కుమార్తెలలో ఒక దానిని నాకుమారునికి పెండ్లిచేయక నా స్వదేశ మందున్న నాబంధువుల యొద్దకు వెళ్ళి ఇస్సాకను నాకుమారునికి భార్యను తెచ్చునట్లు ఆకాశము యొక్క దేవుడును భూమి యొక్క దేవుడునయిన యెహోవా తోడని నీ చేత ప్రమాణము చేయించెద ననెను.''

ఇది విశ్వాసులకు మొదటి హెచ్చరిక. నీవు అవిశ్వాసులతో జతపరచబడలేవు (2కొరింథీ. 6:14). ఈ మొదటి సంగతి నీ మనస్సులో నుంచుకొనవలెను. విశ్వాసులైన తల్లిదండ్రులు అనేకులు ఆ కన్యక లేక ఆయౌవనస్థుడు తిరిగి జన్మించెనా? లేదా? అను విషయము పట్టించుకొనరు. వారు విద్య, డబ్బు, రంగు, కుటుంబము మొదలగు అర్హతల విషయమై శ్రద్ధ కలిగియుందురు. కనాను కుమార్తెలకు

విరోధముగా మిక్కిలి హెచ్చరికను అబ్రాహాము తన దాసునకిచ్చెను. మెట్టు వెంబడి మెట్టు దైవజ్ఞానముచే నడిపించబడవలెను. అతని కప్పగించిన దానిని చేయుటకు అతడు సమర్థుడనియు, దానినతడు నమ్మకముగా చేయుననియు అబ్రాహాము అనుభవము ద్వారా తన సేవకుని విషయము ఎరిగి యుండెను (వ2.) అతడు నమ్మదగిన సేవకుడు. వారి పిల్లలకు సంబంధములు కుదుర్చుటకు అనేకులు తమ చిన్నాన్న, పెద్దనాన్నలపై, చిన్నమ్మ, పెద్దమ్మలపై మరియు వేరే వారిపై నాధారపడుదురు. ఈ విషయములలో అట్టి వారిపై నాధారపడలేవు. నీవు ఈ బాధ్యతను నమ్మదగిన ఆత్మీయ మనుష్యులకు అప్పగించ వలెను.

అబ్రాహాము దాసుడు ప్రతి చిన్న విషయమునకు దేవునిపై నాధారపడినట్లు లేఖనములలో చూచుచున్నాము. ఈ విషయములో వానినొద్దకు వెళ్లి ఆపని నెరవేర్చలేదు (వ.12). దేవుని చిత్తమును నిశ్చయము చేసికొనుటకు అతడు పెద్ద పరీక్షను పెట్టెను. అతడు మానవ జ్ఞానముపై నాధారపడియుండిన యెడల, మొదట ఆ కన్యక ఒక అనుకూలమైన కుటుంబమునకు చెందియుండునట్లు నిశ్చయము చేసికొని యుండెడివాడు. అబ్రాహాము మిక్కిలి ధనవంతుడు కనుక సమాన ధనవంతులైన కుటుంబము కావలయుననెడి లోక మర్యాద చొప్పున ఆదాసుడు నడిపింప బడియుండెడివాడు. కాని ఇట్టి యోగ్యత లేవియు అతని మనస్సులో లేవు, ఈ విషయములో దేవుని చిత్తమును గురించి మాత్రమే అతడు తలంచుచుండెను. మరియు గొప్ప విశ్వాస ముతో ప్రార్థించెను. అతడు ప్రార్థనా పరుడనియు, మిక్కిలి ఆత్మీయమైన వాడనియు ఇది ఋజువు చేయుచున్నది. దేవుని చిత్తమును నిశ్చయము చేసికొనుట ఎట్లో అతడు ఎగిరి వుండెను. అతడు తన స్వంత తీర్మాన ముల ద్వారాగాని లేక అభిప్రాయముల ద్వారాగాని నడిపించ బడలేదు.

తల్లిదండ్రులు అనేకులు భాగ్యవంతమైన సంబంధముల కొరకు పోయి పరిస్థితంటిని తారుమారు చేయుదురు. కాని ఎలియాజరు ధనము లేక రంగు, లేక విద్యయనెడి అర్హతలచేత నడిపించబడలేదు. ఒక సొగసైన కన్యకను చూచినప్పుడెల్ల ''ఈమెయే ఆకన్యక'' యని అతడు తనలో తాననుకొనక ప్రభువును చాలా పెద్ద పరీక్ష పెట్టెను (13,14 వచనములు). ''చిత్తగించుము నేను ఈ నీళ్ళ ఊట యొద్ద నిలుచున్నాను, ఈ ఊరివారి పిల్లలు నీళ్ళు చేదు కొనుటకు వచ్చుచున్నారు. కాబట్టి నేను త్రాగునట్లు నీవు దయచేసి నీకడవను వంచుమని నేను చెప్పగా నీవు త్రాగుము. నీ ఒంటెలకును నీళ్ళు పెట్టెదనని యే చిన్నది చెప్పునో ఆమెయే నీ సేవకుడైన ఇస్సాకు కొరకు నీవు నియమించినదై యుండును గాక''. ఆ దాసునితో పది ఒంటెలుండెను. ఒంటెలు ఒక్కొక్కడి ఐదు పెద్ద బానల నీళ్ళుత్రాగును మరియు ఆ కన్యక పది ఒంటెలకు నీరు చేదు బాధ్యత వహించెను. ఎంత పెద్దపని! దేవుడు మాత్రమే అట్టి పరీక్షకు జయము చేకూర్చగలడు. ఎలియాజరు కియ్యబడిన దైవజ్ఞానమును చూడగలము. పది ఒంటెలకు నీరు చేది పోయగలిగిన కన్యక, విశాలమైన, ఇష్టపడే మృదువైన హృదయము కలిగియుండెను. ధీనురాలైన, ఇష్టపడే కన్యకను ఎలియాజరు వెదకుచుండెను. అతడు ఆత్మీయమైన మనుష్యుడై వుండినందున ఒక ఆత్మీయ కన్యక కొరకు చూచు చుండెను. రిబ్కా అట్టి కన్యక. అబ్రాహాము ఇంటికి వెళ్ళక ముందు, ఇంక కొంతకాలము వారితో నుండుమని ఆమె తల్లి దండ్రులు కోరినప్పుడు ఆమె నిరాకరించి, వెంటనే ఆదాసునితో వెళ్ళుట కిష్టపడెను (58 వచనము). ప్రభువు అతనిని ఎట్లు అడుగడుగున నడిపించెనో అతనియొద్ద తెలిసికొనినప్పుడు ఇస్సాకు కొరకు తాను దేవుని ఏర్పాటని తెలిసికొనెను. కనుక ఆమె ఎలియాజరుతో మారు మాట లేకుండ వెళ్ళెను సాధారణముగా వివాహ ... మున ఇల్లు విడిచి పెట్టునపుడు స్త్రీలు ఏడ్చెదరు కాని రిబ్కా **ఏడ్వలేదు**.

రిబ్కా ఆత్మీయమైన స్త్రీ ఆమె గర్భములో పిల్లలు పెనుగులాడినప్పుడు, ప్రభువునొద్ద ఆమె విచారించెను. (ఆది. కాం. 25:22). దేవుని చిత్తము కనుగొనుటెట్లో ఆమె ఎరుగును సరియైన ఏర్పాటు చేయుటకు దేవుడు ఎలియాజరుకు దైవజ్ఞాన మిచ్చెనని ఈ సంగతులన్నియు చూపించుచున్నవి. నీ కుమారునికి, నీ కుమార్తెకు లేక నీకొరకు జతను కనుగొనవలెనని కోరిన యెడల దయచేసి దైవజ్ఞానము, కృప మరియు సహాయము కొరకు అడుగుము. దేవుని చిత్తమెరుగుటకు ప్రతిపరీక్షను పెట్టుము. మరియు నీ అభిప్రాయములచేత జ్ఞానము చేత లేక తీర్మానముల చేత నడిపించబడవద్దు.

ఆదికాండము 24:63లో ఇస్సాకు ధ్యానించుటకు లేక ప్రార్థించుటకు పొలములోనికి వెళ్ళినట్లు చదువుచున్నాము. ఎలియాజరు అతని కొరకు కన్యకను వెదకుచుండగా, ఇస్సాకు ఆవిషయమును గురించి పొలములో ప్రార్థించుచుండెను. ''ఓ ప్రభువా నా కొరకు సరియైన ఏర్పాటు చేయగలుగునట్లు ఎలియాజరును నడిపించుము'' అని అతడు ప్రార్థించి వుండ వచ్చును. అబ్రాహాము, ఎలియాజరు మరియు ఇస్సాకును ప్రార్థించెను. ఈ రీతిగా వారు దేవుని చిత్తమును కనుగొనగలిగిరి. ఇది నీకు మాదిరిగా నుండనిమ్ము. ఈ విషయములో ఏ పొరపాటు చేయవద్దు. ఎందుకనగా సరియైన జతను ఏర్పాటు చేసికొనుట యను నది అతి ప్రాముఖ్యమైన విషయము. విశ్వాసులైన అనేక తల్లిదండ్రులు, యౌవనస్థులుకూడ ఈ విషయములో పొరపాటు చేయుదురు. మించిపోయిన తరువాత బాధపడుదురు. చుట్టు నున్న అనేక అ సంతోషకరమైన గృహములను చూచి హెచ్చరిక పొందుము.

❖❖